

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV

STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా



సంపుటి - 07 | సంచిక 75 | ఎడిటర్ : బరిగెల శివ | శనివారం 14, ఫిబ్రవరి 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్








# హస్తం జోరును.. అడ్డగిస్తున్న కారు !





ఉత్కంఠత వీడిన మున్సిపల్ ఫలితాలు

వారు ముగిసింది సేవ పిలుస్తుంది

ప్రభుత్వ ఆధిపత్యం స్పష్టంగా వెలువడింది

బీఆర్ఎస్ హవాకు బాటలు వేసిన ప్రజలు

చాలాచోట్ల ప్రభుత్వ ఆధిపత్యంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి

ప్రతి గెలుపులో పైసా ప్రభావం హవా నడిచింది

ప్రధాన నాయకులకు ముచ్చెమటలు పట్టించిన ప్రజలు

ఆధిపత్యం నిరూపించుకోవడానికి తీవ్రంగా కష్టపడిన కాంగ్రెస్

మెజారిటీ చైర్మన్ స్థానాలను కైవసం చేసుకున్న కాంగ్రెస్

స్వతంత్ర అభ్యర్థులు అధికార పార్టీకి మద్దతు తెలుపుతున్నారు

డాక్టర్ బరిగెల శివ

హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)

మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో ప్రజలు అధికార పార్టీని బలపరిచారని డాక్టర్ బరిగెల శివ అభినందించారు.ప్రధాన పార్టీల బలాబలాలను నిరూపించుకునే క్రమంలో చాలా చోట్ల బెదిరింపులు అలజడులు గొడవలు జరగడంతో పాటు అధికార పార్టీ గెలుపు కోసం శక్తిసామర్థ్యాలను ఉపయోగించినట్లుగా కనిపిస్తుండడం గమనార్హం అన్నారు.తెలంగాణ రాష్ట్రంలో 116 మున్సిపాలిటీల్లో అత్యంత ఖరీదైన తీర్పు నిచ్చిన జగిత్యాల మున్సిపల్ పరిధిలోని ప్రజలు తెలంగాణ రాష్ట్ర ఎన్నికల నియామవులకి కొత్త ఆదర్శాన్ని కనపరచారన్నారు.జగిత్యాల మున్సిపాలిటీలో మొత్తం 50 వార్డులకు గాను 14 వార్డుల్లో కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్ రెడ్డి అనుచరులు - మిగతా 2లో..



## మా రెండేళ్ల పాలనకు ఈ ఫలితాలే నిదర్శనం: సీఎం రేవంత్ రెడ్డి

తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం

ఇది తమ రెండేళ్ల పాలనకు ప్రజలు ఇచ్చిన ఆమోదమని సీఎం రేవంత్ వ్యాఖ్య

పేద, మధ్య తరగతి ప్రజల సంక్షేమానికి దక్కిన తీర్పుగా అభివర్ణన

ప్రతి కార్యకర్తకు ఈ విజయాన్ని అంకితం ఇస్తున్నట్లు ప్రకటన

ప్రతి మున్సిపాలిటీని అభివృద్ధి చేసి ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని హామీ



2

## మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీదే హవా..

రెండో స్థానంలో బీఆర్ఎస్.. తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ భారీ విజయం

116 మున్సిపాలిటీలకు గాను 66 కైవసం చేసుకున్న అధికార పార్టీ

13 మున్సిపాలిటీలతో రెండో స్థానంలో బీఆర్ఎస్

37 చోట్ల హంగ్.. చైర్మన్ ఎన్నికల్లో స్వతంత్రులదే కీలకపాత్ర

ప్రధాన కార్పొరేషన్లలోనూ కొనసాగిన కాంగ్రెస్ ఆధిపత్యం



2

## హైదరాబాద్‌లో అక్రమ సరోగసీ రాకెట్.. లేడీ డాక్టర్ ను అరెస్ట్ చేసిన ఈడీ

2

## నన్ను నేను 'డాక్టర్ శ్రీలీల'గా పరిచయం చేసుకుంటున్నాను: శ్రీలీల

డాక్టర్‌గా మారిన ప్రముఖ నటి శ్రీలీల

సోషల్ మీడియా ద్వారా శుభవార్త పంచుకున్న వైనం


షూటింగ్‌లతో బిజీగా ఉంటూనే చదువు పూర్తి

ఇకపై డాక్టర్ శ్రీలీల అని పిలవాలంటూ పోస్ట్

కుటుంబం, స్నేహితులకు కృతజ్ఞతలు తెలిపిన హీరోయిన్



2



## నాలాగే ఎందరో కన్నీళ్లు పెట్టుకున్నారు

ప్రజలు అన్నీ గమనించి తీర్పు ఇచ్చారు: సీఎం చంద్రబాబు

గత పాలనలో భూ వివాదాలపైనే ఎక్కువ ఫిర్యాదులు అందాయన్న సీఎం

2026 నాటికి రెవెన్యూ రికార్డుల ప్రక్షాళన చేపడతామని వెల్లడి

తిరుపతి లడ్డూ వివాదంలోకి హెరిటేజ్‌ను లాగి బ్రాండ్ దెబ్బతీశారని ఆగ్రహం

ప్రత్యర్థిని ఆర్థికంగా దెబ్బతీయడమే ఫ్యాక్షనిస్టుల లక్ష్యమని వ్యాఖ్యలు

దేవాలయాల పవిత్రతను కాపాడతామని స్పష్టీకరణ

5

# మా రెండేళ్ల పాలనకు ఈ ఫలితాలే నిదర్శనం: సీఎం రేవంత్ రెడ్డి

తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం

ఇది తమ రెండేళ్ల పాలనకు ప్రజలు ఇచ్చిన ఆమోదమని సీఎం రేవంత్ వ్యాఖ్య

పేద, మధ్య తరగతి ప్రజల సంక్షేమానికి దక్కిన తీర్పుగా అభివర్ణన

ప్రతి కార్యకర్తకు ఈ విజయాన్ని అంకితం ఇస్తున్నట్లు ప్రకటన

ప్రతి మున్సిపాలిటీని అభివృద్ధి చేసి ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని హామీ

హైదరాబాద్, జై భీమ్ న్యూస్

తెలంగాణలో జరిగిన మున్సిపల్ ఎన్నికల ఫలితాలు తమ రెండేళ్ల పాలనకు ప్రజలు ఇచ్చిన బలమైన తీర్పు అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీకి అఖండ విజయాన్ని అందించిన ప్రజలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. తమ ప్రజా ప్రభుత్వ పాలనకు, పేద, మధ్య తరగతి ప్రజల సంక్షేమానికి, ప్రపంచస్థాయి ప్రణాళికలతో అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఈ తీర్పు ద్వారా ప్రజలు సంపూర్ణ ఆమోదం తెలిపారని ఆయన శుక్రవారం పేర్కొన్నారు. రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లకు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించింది. వెలువడిన ఫలితాల ప్రకారం, 116 మున్సిపాలిటీలకు గాను 66 చోట్ల కాంగ్రెస్ జెండా ఎగురవేసింది. అలాగే 7 కార్పొరేషన్లలో 3 చోట్ల స్పష్టమైన మెజారిటీ సాధించగా, మరో కార్పొరేషన్‌లో ఆధిక్యంలో కొనసాగుతోంది. ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాని మరో 37 మున్సిపాలిటీలలో కూడా పీఠాలను కైవసం చేసుకునేందుకు అధికార కాంగ్రెస్ పార్టీ ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఈ చారిత్రక విజయంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 'ఎక్స్' వేదికగా స్పందించారు. "లక్షలాది మంది కాంగ్రెస్ కార్యకర్తల అవిశ్రాంత శ్రమకు దక్కిన ఫలితమే ఈ విజయం. పార్టీ పట్ల వారికి ఉన్న అపారమైన అభిమానానికి ఇది నిలువుటద్దం. పార్టీ జెండాను మోసి, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లిన ప్రతి కార్యకర్తకు ఈ విజయాన్ని అంకితం చేస్తున్నాను" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. ఈ గెలుపు తమ బాధ్యతను మరింత పెంచిందని సీఎం అన్నారు. రాష్ట్ర అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి, పారదర్శక పాలనకు తాము పునరంకితం అవుతున్నామని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఎన్నికల్లో ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని ప్రతి మున్సిపాలిటీని, ప్రతి కార్పొరేషన్‌ను అభివృద్ధి పథంలో నడిపించి చూపిస్తామని ఆయన భరోసా ఇచ్చారు. ఈ ఫలితాలు ప్రభుత్వ పనితీరుకు ప్రజలు ఇచ్చిన సానుకూల తీర్పుగా రాజకీయ విశ్లేషకులు అభివర్ణిస్తున్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీదే హవా..

రెండో స్థానంలో బీఆర్ఎస్

తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ భారీ విజయం

116 మున్సిపాలిటీలకు గాను 66 కైవసం చేసుకున్న అధికార పార్టీ

13 మున్సిపాలిటీలతో రెండో స్థానంలో బీఆర్ఎస్

37 చోట్ల హంగ్.. చైర్మన్ ఎన్నికల్లో స్వతంత్రులదే కీలకపాత్ర

ప్రధాన కార్పొరేషన్లలోనూ కొనసాగిన కాంగ్రెస్ ఆధిపత్యం

హైదరాబాద్, జై భీమ్ న్యూస్

తెలంగాణలో జరిగిన మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో అధికార కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం సృష్టించింది. రాష్ట్రంలోని మెజారిటీ మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను కైవసం చేసుకుని తన పట్టును నిరూపించుకుంది. శాసనసభ ఎన్నికల తర్వాత జరిగిన ఈ కీలక పోరులో కాంగ్రెస్ ఘనవిజయం సాధించింది. ఇప్పటివరకు వెలువడిన ఫలితాల ప్రకారం, రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ పార్టీ ఏకంగా 66 చోట్ల విజయం సాధించింది. మొత్తం 2,582 వార్డులకు గాను 1,347 వార్డుల్లో హస్తం గుర్తు అభ్యర్థులు గెలుపొందారు. ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ కేవలం 13 మున్సిపాలిటీలు, 717 వార్డులతో రెండో స్థానానికి పరిమితమైంది. ఇక బీజేపీ 261 వార్డుల్లో, ఇండిపెండెంట్ అభ్యర్థులు 256 వార్డుల్లో గెలిచారు. మరో 37 మున్సిపాలిటీల్లో ఏ పార్టీకీ స్పష్టమైన మెజారిటీ రాకపోవడంతో హంగ్ వాతావరణం నెలకొంది. ఈ ప్రాంతాల్లో చైర్మన్ల ఎన్నికలో స్వతంత్రులు, ఇతర చిన్న పార్టీల మద్దతు కీలకం కానుంది. మహబూబ్‌నగర్ జిల్లాలోని వడ్డేపల్లి మున్సిపాలిటీని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ గెలుచుకోవడం విశేషం. కార్పొరేషన్లలోనూ కాంగ్రెస్ హవా స్పష్టంగా కనిపించింది. మంచిర్యాల, రామగుండం, నల్గొండ కార్పొరేషన్లను కాంగ్రెస్ దక్కించుకుంది. ఇంకా పలు చోట్ల ఓట్ల లెక్కింపు కొనసాగుతుండగా, పూర్తి స్థాయిలో ఫలితాలు వెలువడాల్సి ఉంది.

# హైదరాబాద్‌లో అక్రమ సరోగసీ రాకెట్

లేడీ డాక్టర్ ను అరెస్ట్ చేసిన ఈడీ

అక్రమ సరోగసీ కేసులో డాక్టర్ నమ్రతను అరెస్ట్ చేసిన ఈడీ

సంతానం లేని దంపతులకు శిశువులను అక్రమంగా అమ్మకాలు

మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద కేసు నమోదు

ఫిబ్రవరి 26 వరకు నిందితురాలికి జ్యుడీషియల్ రిమాండ్

గతంలోనూ పలు కేసుల్లో అరెస్టయిన డాక్టర్ నమ్రత

హైదరాబాద్, జై భీమ్ న్యూస్

హైదరాబాద్‌లో సంచలనం సృష్టించిన అక్రమ సరోగసీ రాకెట్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కీలక చర్యలు చేపట్టింది. ఈ కేసుకు సంబంధించి మనీలాండరింగ్ ఆరోపణలపై డాక్టర్ అడుతూరు నమ్రత అలియాస్ పచ్చిపల్లి నమ్రతను శుక్రవారం అరెస్ట్ చేసింది. అనంతరం ఆమెను కోర్టులో హాజరుపరచగా, ఫిబ్రవరి 26 వరకు జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ అండ్ రీసెర్చ్ సెంటర్ పేరుతో నమ్రత ఈ అక్రమ దందా నడిపినట్లు ఈడీ దర్యాప్తులో తేలింది. సంతానం లేని దంపతుల నుంచి భారీగా డబ్బులు వసూలు చేసి, వారికి సరోగసీ ద్వారా బిడ్డను అందిస్తామని నమ్మించేవారు. అయితే, పేదరికంతో బిడ్డలను పెంచుకోలేని గర్భిణులను ఏజెంట్ల ద్వారా గుర్తించి, పుట్టిన వెంటనే శిశువులను కొనుగోలు చేసేవారని ఈడీ ఆరోపించింది. ఆడశిశువుకు రూ. 3.5 లక్షలు, మగశిశువుకు రూ. 4.5 లక్షలు చెల్లించి, వారిని సంతానం లేని దంపతులకు అమ్మేవారని దర్యాప్తులో వెల్లడైంది. ఈ రాకెట్‌పై గతంలోనే హైదరాబాద్ గోపాలపురం పోలీస్ స్టేషన్‌లో చీటింగ్, చైల్డ్ ట్రాఫికింగ్ వంటి అభియోగాలపై పలు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. ఆ కేసుల్లో 2025 నవంబర్‌లో బెయిల్‌పై విడుదలైన ఆమె, మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు చేపట్టిన ఈడీ విచారణకు సహకరించకపోవడంతో తాజాగా పీఎంఎల్ఏ చట్టం కింద అరెస్ట్ చేశారు. సికింద్రాబాద్‌లోని ఆసుపత్రి లైసెన్సు రద్దు కాగా, విశాఖపట్నం కేంద్రంగా ఈ దందాను కొనసాగించినట్లు ఈడీ గుర్తించింది. దంపతులనే అసలు తల్లిదండ్రులుగా చూపిస్తూ నకిలీ జనన ధృవపత్రాలు సృష్టించినట్లు కూడా ఈడీ తెలిపింది. ఈ రాకెట్‌లో ఏజెంట్లు, సబ్-ఏజెంట్ల నెట్‌వర్క్ కీలకంగా వ్యవహరించిందని, దర్యాప్తు కొనసాగుతోందని అధికారులు వివరించారు.

# హస్తం 'జోరును' అడ్డగిస్తున్న కారు

మొదటి పేజీ తరువాయి

స్వతంత్ర అభ్యర్థులుగా నిలబడి అఖండ విజయం సాధించడం రాష్ట్ర రాజకీయాలలో నిజాయితీని కనపరచారన్నారు.వర్ధన్నపేట నియోజకవర్గం లోని ఐదవ డివిజన్ కు చెందిన స్వతంత్ర అభ్యర్థిని శిబారాణి గెలుపులో క్రియాశీలక పాత్ర పోషించిన జై భీమ్ సంస్థ చైర్మన్ డాక్టర్ బరిగెల శివ ప్రధాన పార్టీలైన కాంగ్రెస్ బీఆర్ఎస్ బిజెపి పార్టీల నుండి టికెట్ ఆశించి భంగపడిన స్వతంత్ర అభ్యర్థిని పోటీల్లో నిలిపి గెలిపించడమే కాకుండా వర్ధన్నపేట నియోజకవర్గం మున్సిపాలిటీ చైర్మన్ పదవిని దక్కించుకోవడం కోసం కాంగ్రెస్ బీఆర్ఎస్ మధ్య జరుగుతున్న తీవ్రమైన పోటీలో ఐదవ వార్డు మెంబర్ క్రియాశీలక పాత్ర పోషించే ఆస్కారం 100 శాతం కలదన్నారు.ఐదో వార్డ్ మెంబర్ కాంగ్రెస్ పార్టీకి సహకరిస్తుండడంతో వర్ధన్నపేట మున్సిపాలిటీ చైర్మన్ పదవి సమఉజ్జీవుల మధ్య నడుస్తుందన్నారు.వర్ధన్నపేట మున్సిపాలిటీలో 12వ వార్డు మెంబర్ బీఆర్ఎస్ పార్టీ గెలుపొందిందని ఫలితం విడుదల చేసిన ఎన్నికల అధికారులు కాసేపటికి మాట మార్చేసి ఫలితం తారుమారు చేశారని బీఆర్ఎస్ శ్రేణులు మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నాలు నిర్వహించడమే కాకుండా జరిగిన తప్పిదం పట్ల ఎన్నికల అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని తప్పులకు పాల్పడిన అధికారులపై ఎన్నికల కమిషనర్ కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించడం జరిగిందన్నారు.రాష్ట్రవ్యాప్తంగా 2,582 వార్డులకు ఎన్నికలు నిర్వహించబడగా అత్యధిక స్థానాల్లో హస్తం పార్టీ 1,347 స్థానాలను గెలిచిందన్నారు.రెండవ దశలో బీఆర్ఎస్ పార్టీ 717 స్థానాలను గెలుపొందగా మూడవ స్థానంలో బిజెపి 261 స్థానాలను గెలుచుకుందని తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా స్వతంత్ర అభ్యర్థులు 256 స్థానాల్లో గెలుపొందగా మొత్తం మీదుగా 116 మున్సిపాలిటీలో 64 మున్సిపాలిటీలను కాంగ్రెస్ పార్టీ గెలుపు పొందగా 13 స్థానాల్లో బీఆర్ఎస్ 38 స్థానాల్లో హంగు ఏర్పడిందని హంగు ఏర్పడిన స్థానాల్లో స్వతంత్ర అభ్యర్థులు అధికార పార్టీకి మద్దతు తెలుపుతున్నారని అప్పటికే వార్డు మెంబర్లు కాంగ్రెస్ పార్టీ నాయకుల చేతుల్లోనికి వెళ్లిపోయారన్నారు.ఎక్కడ చూసినా ఏకపక్ష పోరు జరుగకపోగా చాలా చోట్ల బీఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్ పార్టీని నిలువరించే ప్రయత్నాలు చేసిందన్నారు.వార్డ్ మెంబర్ల గెలుపులో క్రియాశీలక పాత్ర పోషించిన నాయకులలో ప్రజల తరఫున పోరాడుతూ ప్రజలకు సహాయపడే నాయకులు చాలా తక్కువగా ఉన్నారన్నారు.కౌంటింగ్ లోపల ప్రతిపక్ష పార్టీలను బోల్తా కొట్టించిన పార్టీలు లేకపోలేదన్నారు.ప్రధాన అధికార పార్టీకి చెందిన నాయకుల మున్సిపాలిటీలలో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు చెమటలు పట్టించారని తీవ్రంగా విమర్శించారు.తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలలోని మొత్తం మున్సిపాలిటీ స్థానాల్లో జగిత్యాల మున్సిపాలిటీ ఆదర్శవంతమైన నిజాయితీని కనపరచడం పట్ల కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్ రెడ్డి ఎంతటి శక్తివంతుడు ఎంతటి సమర్థుడో ఎంతటి నిజాయితీపరులో కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇకనైనా తెలియాలన్నారు.పార్టీలు మారిన వ్యక్తులే బహిరంగంగా అప్పుడు రాజకీయాలకు పాల్పడుతుంటే ప్రజలు జీవన్ రెడ్డి లాంటి నిజాయితీ గలిగిన నాయకుల వెంట ఉంటారని తెలపడానికి ఇది ఒక చక్కని ఉదాహరణ అన్నారు.రాష్ట్రమంతా ప్రజాసేవ కోసం ఎదురుచూస్తున్నారని మునుగోడు నియోజకవర్గంలో సీనియర్ శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేస్తున్న సేవలు ప్రతి నియోజకవర్గంలో చేయబడాలని ప్రజలు ఎంతగానో ఆశిస్తున్నారన్నారు.మున్సిపల్ ఎన్నికలు ముగిసి ఫలితాలు ఏర్పడ్డాక మున్సిపల్ ఎన్నికల ఫలితాలు ప్రజలపై ఎక్కువగా ప్రభావం చూపించలేక పోయిందన్నారు.అధికార పార్టీ అడపాదడప ఆధిపత్యాన్ని చెలాయించడం వల్లనే ఇలాంటి గెలుపు సాధ్యమైందని ప్రజలు భావిస్తున్నారన్నారు.అధికార పార్టీ తరఫున ముఖ్య నేతలు ప్రచారం చేసిన చాలా స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ ఓడిపోయిందన్నారు.సర్పంచ్ ఎన్నికల్లో పాటించిన సిద్ధాంతాలను మళ్ళీ మళ్ళీ పాటించినట్లుగా పార్టీలు మారిన నాయకులకి అవకాశాలు కల్పించి మున్సిపాలిటీ స్థానాలను కైవసం చేసుకున్నప్పటికిని గెలిచిన నాయకులు అందరూ గతంలో బీఆర్ఎస్ పార్టీతో పని చేసిన వారి సంగతిని కాంగ్రెస్ పార్టీ మరిచిపోవద్దన్నారు.ఒక్కొక్క ఎన్నికలు జరుగుతున్న కొద్ది ప్రజల లోపల ఒక రకమైన వెలితితోపాటు నిరాశ, నిస్పృహలు కనిపిస్తున్నాయన్నారు.చివరకు ప్రభుత్వమైనా ప్రతిపక్షమైన చైర్మన్ దానాలను దక్కించుకోవడం కోసం హంగు ఏర్పడిన స్థానాల్లో స్వతంత్ర అభ్యర్థులపై ఆధారపడాల్సిరావడం కాంగ్రెస్ పార్టీ ఆధిపత్యం ప్రజల్లో తగ్గిపోతున్నట్లుగా కనిపిస్తుందన్నారు.ఎలాగూ స్వతంత్ర అభ్యర్థులు వార్డుల అభివృద్ధి కోసం నిధులు సేకరించుకునే క్రమంలో అధికార పార్టీకి సహకరించక తప్పడం లేదన్నారు.ఫలితాలపై ఆయా పార్టీల ప్రధాన నేతలు దీమాలు వ్యక్తం చేస్తున్నప్పటికిని ప్రజల ఆలోచనలకు ప్రజల మనోభావాలకు అనుకున్న రీతిగా ప్రజా విశ్వాసాన్ని గెలిచిన పార్టీలు మాత్రం అన్ని అంతంత మాత్రమేన్నారు. ఏ సందర్భంలోనైనా అధికార పార్టీ ఇతర పార్టీలను గెలుపు రేసులో దరిదాపుల్లోనికి కూడా రాణించే పరిస్థితిలో ఉండవు కాబోలు ప్రస్తుతం జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో ప్రభుత్వం తో పాటు బీఆర్ఎస్ పార్టీ ప్రజలను ఉన్నత స్థాయిలో ఆకర్షించిందన్నారు.అన్నిచోట్ల ప్రజాసేవ కట్టుబడి ప్రజలకు మేలు చేస్తామన్న పెద్దపెద్ద నాయకులు ప్రచారంలో పాల్గొన్నప్పటికిని ఆయా ప్రచారాలు జోరుగా సాగిన ప్రాంతాల్లో స్వతంత్ర అభ్యర్థులు గెలవడం రాజకీయ పార్టీలపై ప్రజలకు విశ్వాసం నమ్మకం సన్నగిల్లినట్లుగా కనిపిస్తుందన్నారు.దీన్ని బట్టి చూస్తే 38 స్థానాల్లో హంగురావడం రాజకీయ పార్టీల బలాబలాలు ఎటు తేల్చుకోలేకపోయాయన్నారు. అధికారంలో ఉన్న పార్టీ ప్రతిపక్షాలను దరిదాపుల్లోని కూడా రానివ్వకుండా గెలవాల్సి ఉండగా అంత గొప్పగా ప్రచారం చేసి అనుకున్న స్థానాలను గెలుచుకోకపోవడం అనుకున్న వార్డు మెంబర్లను గెలిపించుకోలేకపోవడం నాయకుల సమర్థతతో పాటు ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం తగ్గిపోతుంది అన్నారు.గెలిచిన పార్టీలను, గెలిచిన నాయకులను అధికార పార్టీలోనికి లాక్కోవడానికి చేస్తున్న ప్రయత్నాలు పూర్తి శాతం సఫలీకృతమయ్యే ఆస్కారాలు ఎక్కువగా కనిపిస్తున్నాయన్నారు.ప్రజాసేవను అనుకున్న స్థాయిలో కొనసాగించడం కోసం ఎక్కువ శాతం నాయకులు అధికార పార్టీ వైపే మొగ్గు చూపే ఆస్కారాలు ఉంటుండగా ప్రతిపక్షాలు ఆయా గెలుపొందిన వాడు మెంబర్లతో పాటు మున్సిపల్ చైర్మన్ లను కాపాడుకుంటుండడంతో పాటు ప్రజలకు ఇంకా ఎక్కువగా ప్రభుత్వం తరఫున సేవలందించబడేటట్లు పోరాటం చేయగలిగితే రానున్న రోజుల్లో బీఆర్ఎస్ పార్టీ పూర్తిస్థాయిలో బలపడడం ఖాయమన్నారు.

# నల్గొండ అంటే కాంగ్రెస్ అని మరోసారి రుజువు చేశారు: మంత్రి కోమటిరెడ్డి

నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం

నల్లగొండను హైదరాబాద్‌కు దీటుగా అభివృద్ధి చేస్తానన్న మంత్రి కోమటిరెడ్డి

వారానికి రెండు రోజులు స్థానికంగా ఉండి సమస్యలు పరిష్కరిస్తానని హామీ

ప్రతి డివిజన్‌లో ప్రజా దర్బార్ నిర్వహించనున్నట్లు ప్రకటన



నల్గొండ, జై భీమ్ న్యూస్

నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ చారిత్రాత్మక విజయం సాధించడం పట్ల రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌కు అఖండ మెజారిటీని కట్టబెట్టిన నల్గొండ ప్రజలకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా, నల్గొండ పట్టణాన్ని హైదరాబాద్‌కు దీటుగా అభివృద్ధి చేసి చూపిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రజా పాలనకు ఈ గెలుపు నిదర్శనమని అన్నారు. నల్గొండలో మొత్తం 48 వార్డులకు గాను కాంగ్రెస్ కు 27, బీఆర్ఎస్ కు 9, బీజేపీకి 4, ఇతరులకు 8 స్థానాలు దక్కాయి. ఈ విజయం ద్వారా "నల్గొండ అంటే కాంగ్రెస్... కాంగ్రెస్ అంటే నల్గొండ" అని ప్రజలు మరోసారి రుజువు చేశారని కోమటిరెడ్డి వ్యాఖ్యానించారు. రాష్ట్రవ్యాప్తంగా గెలిచిన కాంగ్రెస్ అభ్యర్థులందరికీ ఆయన అభినందనలు తెలిపారు. గెలుపొందిన కార్పొరేటర్లు ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలని సూచించారు. అదే సమయంలో, ఓటమి పాలైన అభ్యర్థులు నిరుత్సాహపడకుండా, తమ డివిజన్లలోని సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. రాజకీయాలకు అతీతంగా ప్రజా సమస్యల పరిష్కారమే తమ ప్రభుత్వ ఎజెండా అని స్పష్టం చేశారు. నల్గొండ ప్రజలకు మరింత చేరువయ్యేందుకు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు మంత్రి ప్రకటించారు. ఇకపై వారానికి రెండు రోజులు తాను నల్గొండలోనే అందుబాటులో ఉండి, ప్రజా సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు. అంతేకాకుండా, ప్రతి డివిజన్‌లో ప్రజా దర్బార్ నిర్వహించి, క్షేత్రస్థాయిలో సమస్యలను తెలుసుకుని తక్షణమే పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని భరోసా ఇచ్చారు. నల్గొండలో కాంగ్రెస్ జెండా ఎగురవేసిన ప్రతి కార్యకర్తకు, ఓటు వేసిన ప్రజలకు ఆయన మరోసారి ధన్యవాదాలు తెలిపారు.

# నన్ను నేను 'డాక్టర్ శ్రీలీల'గా పరిచయం చేసుకుంటున్నాను: శ్రీలీల

డాక్టర్‌గా మారిన ప్రముఖ నటి శ్రీలీల

సోషల్ మీడియా ద్వారా శుభవార్త పంచుకున్న వైనం

షూటింగ్‌లతో బిజీగా ఉంటూనే చదువు పూర్తి

ఇకపై డాక్టర్ శ్రీలీల అని పిలవాలంటూ పోస్ట్

కుటుంబం, స్నేహితులకు కృతజ్ఞతలు తెలిపిన హీరోయిన్

హైదరాబాద్, జై భీమ్ న్యూస్

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ శ్రీలీల తన జీవితంలో ఒక ముఖ్యమైన మైలురాయిని చేరుకున్నారు. నటనలో అగ్రస్థానంలో కొనసాగుతూనే, ఆమె ఇప్పుడు డాక్టర్‌గా మారారు. కొన్ని రోజుల కిందట ఎంబీబీఎస్ పట్టా అందుకున్నారు. దీనిపై ఇవాళ ఆమె సోషల్ మీడియా వేదికగా ఒక భావోద్వేగ పోస్ట్ చేశారు. ఇకపై తనను 'డాక్టర్ శ్రీలీల'గా ప్రేమగా పరిచయం చేసుకుంటున్నట్లు తెలిపారు. "మీ అమ్మాయి తన మాట నిలబెట్టుకుంది" అంటూ తన పోస్ట్‌ను ప్రారంభించిన శ్రీలీల, ఈ ప్రయాణం తనకెంతో ప్రత్యేకమని అన్నారు. ఇది కేవలం ఒక డిగ్రీ మాత్రమే కాదని, తన ఎదుగుదల, విశ్వాసం, కన్నీళ్లు, పట్టుదలకు నిదర్శనమని పేర్కొన్నారు. తాను చదువుకునే ప్రదేశం తనకు ఒక పవిత్రమైన స్థలంలాంటిదని, అక్కడ మాత్రమే తాను తనలా ఉండగలిగానని వివరించారు. ఈ కష్ట సమయంలో తన పరీక్షలకు సహకరించిన కుటుంబ సభ్యులకు, స్నేహితులకు, చిత్ర బృందాలకు ఆమె హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తనను తాను నమ్మడం నేర్చుకుంటున్న దశలో తనపై నమ్మకం ఉంచిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు చెప్పారు. వరుస సినిమాలతో క్షణం తీరిక లేకుండా గడుపుతూ కూడా పట్టుదలతో చదువును పూర్తి చేసి డాక్టర్ పట్టా సాధించడంపై శ్రీలీలను అభిమానులు, సినీ ప్రముఖులు ప్రశంసలతో ముంచెత్తుతున్నారు. ఆమె పోస్ట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

# మున్సిపల్ ఎన్నికల విజయం వేళ, ప్రియాంక గాంధీతో రేవంత్ రెడ్డి భేటీ

మున్సిపల్ ఎన్నికల్లో విజయంపై ప్రియాంక గాంధీ అభినందన

సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల కారణంగానే ప్రజలు పట్టం కట్టారన్న ముఖ్యమంత్రి

ప్రజాపాలనకు ఈ ఫలితాలు నిదర్శనమన్న మల్లు భట్టివిక్రమార్క

హైదరాబాద్, జై భీమ్ న్యూస్

తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించిన వేళ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకురాలు, వయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీతో భేటీ అయ్యారు. మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ భారీ విజయం సాధించడంపై వారి మధ్య చర్చ జరిగింది. అత్యధిక మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను దక్కించుకోవడంపై హర్షం వ్యక్తం చేసిన ప్రియాంక గాంధీ... రేవంత్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీకి అభినందనలు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల కారణంగానే ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆదరించారని ఈ సందర్భంగా ప్రియాంక గాంధీతో రేవంత్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ గెలుపుపై ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క స్పందించారు. రెండున్నరేళ్ల ప్రజాపాలనకు ఈ ఫలితాలు నిదర్శనమని అన్నారు. కాంగ్రెస్ సంక్షేమ, అభివృద్ధి పాలనకు ప్రజలు పట్టం కట్టారని అన్నారు. ఈ ప్రభుత్వంపై ప్రజలకు ఉన్న నమ్మకం, విశ్వాసం ఆదరణగా మారిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు గెలుపే లక్ష్యంగా శ్రమించారని ప్రశంసించారు.

# 30 ఏళ్ల రైతుల కల నెరవేర్చిన ఆత్మకూర్ సర్పంచ్ మహేశ్వరి-రాజు

**మూతపడిన కాలువ పునరుద్ధరణ -- 1400 ఎకరాలకు సాగునీరు**

**ఆత్మకూర్, 13 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

ముప్పై సంవత్సరాలుగా మూతపడిన కాలువను పునరుద్ధరించి రాయకుంట చెరువుకు నీటిని చేరేలా చేసి రైతుల కలను సాకారం చేసిన ఘటన ఆత్మకూర్‌లో చోటుచేసుకుంది. గ్రామ సర్పంచ్ పర్వతగిరి మహేశ్వరి--రాజు పట్టుదలతో చేపట్టిన ఈ చర్య వల్ల సుమారు 1400 ఎకరాల ఆయకట్టు రైతులకు రబీ పంట సాగు చేసుకునే అవకాశం కలిగింది. రాయకుంట చెరువుకు వర్షపు నీటితో పాటు పెద్ద చెరువు నుంచి వచ్చే ప్రధాన కాలువ 30 ఏళ్లుగా మూతపడడంతో ఆయకట్టు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైతుల సమస్యను గుర్తించిన సర్పంచ్ మహేశ్వరి--రాజు స్వయంగా పర్యవేక్షిస్తూ కాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారం, చెట్లు తొలగించి పెద్ద చెరువు నుంచి గ్రామం వరకు కాలువను పునరుద్ధరించారు. శుక్రవారం ఉదయం రైతులతో కలిసి ఆత్మకూర్ పెద్ద చెరువు తూము వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, రైతులు తమ సమస్యను దృష్టికి తీసుకురాగానే వెంటనే చర్యలు తీసుకుని కాలువ మరమ్మతులు చేయించి నీటిని విడుదల చేశామని తెలిపారు. దీనివల్ల రైతులు రబీ పంట సాగు చేసుకునే అవకాశమొచ్చిందని, రైతుల



సంక్షేమం కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తామని చెప్పారు. అలాగే గ్రామ అభివృద్ధికి పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, సహకారంతో పాటు స్థానిక ప్రజాప్రతినిధుల అండదండలతో ప్రభుత్వం నుంచి నిధులు తీసుకొచ్చి ఆత్మకూర్‌ను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు. అర్హులైన నిరుపేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. జాతీయ రహదారిపై చాలా కాలంగా వెలగని విద్యుత్ దీపాలను మార్చి కొత్త దీపాలను అమర్చినట్లు, గ్రామ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి కొనసాగిస్తామని సర్పంచ్ మహేశ్వరి--రాజు తెలిపారు. కాలువ పునరుద్ధరణతో సాగునీరు అందడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు.



# శ్రీ మెట్టు రామలింగేశ్వరస్వామి జాతర ఏర్పాట్లపై విస్తృతంగా పరిశీలన

**భక్తులకు ప్రశాంత దర్శనం కోసం పకడ్బందీ బందోబస్తు**
**మడికొండ ఇన్స్పెక్టర్ పుల్యాల కిషన్**



**మడికొండ, 13 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

హనుమకొండ జిల్లా మడికొండలోని శ్రీ మెట్టు రామలింగేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించనున్న వార్షిక జాతర సందర్భంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ఏర్పాట్లను మడికొండ స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌ఓ) పుల్యాల కిషన్, సబ్‌ఇన్‌స్పెక్టర్లు రాజ్ కుమార్, పోలీసు సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ పరిసర ప్రాంతాల్లో భక్తుల సౌకర్యార్థం చేపడుతున్న వివిధ ఏర్పాట్లను సమగ్రంగా పరిశీలించారు. ముఖ్యంగా లైటింగ్ సదుపాయాలు, తాగునీటి ఏర్పాటు, వాహనాల పార్కింగ్ స్థలాలు, భక్తుల రాకపోకలకు అనువుగా క్యూ లైన్ల ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు వంటి అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. జాతర రోజుల్లో పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో భక్తులు ప్రశాంత వాతావరణంలో స్వామి వారి దర్శనం చేసుకునేలా పోలీసు శాఖ తరపున పకడ్బందీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. అదేవిధంగా భక్తులు క్రమశిక్షణ పాటిస్తూ పోలీసులకు సహకరించాలని, పార్కింగ్ మరియు క్యూ లైన్ వ్యవస్థలను పాటించడం ద్వారా అందరికీ సౌకర్యవంతమైన దర్శనం కల్పించవచ్చని సూచించారు. జాతర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు శాఖ పూర్తి అప్రమత్తంగా పనిచేస్తుందని తెలిపారు. ఈ పరిశీలన కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

# రసాయన శాస్త్ర జాతీయ సదస్సు గోడపత్రిక ఆవిష్కరణ




**హన్మకొండ, 13 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

విశ్వవిద్యాలయ రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మార్చి 16, 17 తేదీలలో నిర్వహించనున్న "కరెంట్ రీసెర్చ్ ఇన్ కెమికల్ సైన్సెస్" అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సుకు సంబంధించిన గోడపత్రికను వైస్ చాన్సలర్ ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, ఈ జాతీయ సదస్సు ద్వారా రసాయన శాస్త్రంలో తాజా పరిశోధన ధోరణులు, ఆధునిక ఆవిష్కరణలు, శాస్త్రీయ అభివృద్ధిపై విశ్లేషణాత్మక చర్చలు జరగనున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా శాస్త్రవేత్తలు, అధ్యాపకులు, పరిశోధకులు పాల్గొనే ఈ సదస్సు విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య ఎన్. వాసుదేవ రెడ్డి, డీన్ ఆచార్య జి. హనుమంతు, ఆచార్యులు టి. సవితా జ్యోత్స్న, ఎస్. జ్యోతి, పాలక మండలి సభ్యురాలు ఆచార్య బి. రమ, ఆచార్య ఆర్. మల్లికార్జున రెడ్డి, డాక్టర్ కె. మమత, డాక్టర్ ఎస్. రంగారెడ్డి, డాక్టర్ ఎన్. శ్రీనివాస్, డాక్టర్ కవిత, డాక్టర్ వినుత, డాక్టర్ నాగేశ్వర్ రావు, డాక్టర్ సృజన తదితర బోధనా సిబ్బంది పాల్గొన్నారు.

# మండలిని శాసించాలని బొత్స ప్రయత్నించడం హాస్యాస్పదం: మంత్రి అచ్చెన్నాయుడు

**వైసీపీ నేతలపై అచ్చెన్నాయుడు ఫైర్**
**పరిశ్రమల ఏర్పాటుపై ద్వంద్వ వైఖరి అంటూ విమర్శలు**
**భూములే ఇవ్వకపోతే కంపెనీలు ఎలా వస్తాయని ప్రశ్న**

**విజయవాడ, జై భీమ్ న్యూస్**



వైసీపీ ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ శాసనమండలిని శాసించాలని చూడటం హాస్యాస్పదంగా ఉందని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో విమర్శించారు. గురువారం మండలిలో రాష్ట్ర అభివృద్ధిపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుపై వైసీపీ ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఐదేళ్ల పాలనలో ఒక్క కంపెనీని కూడా తీసుకురాలేకపోయిన వైసీపీ నేతలు, ఇప్పుడు కూటమి ప్రభుత్వం పరిశ్రమలు తీసుకొస్తుంటే బురదజల్లడమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. పరిశ్రమలకు భూములే ఇవ్వకపోతే కంపెనీలు ఎలా వస్తాయని అచ్చెన్నాయుడు ప్రశ్నించారు. మంత్రి నారా లోకేశ్ గణాంకాలతో సహా సమాధానం ఇస్తుంటే, వినే ఓపిక లేక వైసీపీ సభ్యులు సభలో గందరగోళం సృష్టిస్తున్నారని ఆయన ఆరోపించారు. మన దేశానికి వస్తున్న ప్రతి వంద రూపాయల పెట్టుబడిలో 26 రూపాయలు ఆంధ్రప్రదేశ్‌కే వస్తున్నాయని, ఇదే తమ కూటమి ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని అచ్చెన్నాయుడు తెలిపారు. వెనుకబడిన ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందాలన్నా, రాష్ట్ర యువతకు ఉద్యోగాలు రావాలన్నా పరిశ్రమల స్థాపన అత్యవసరమని స్పష్టం చేశారు. కేవలం రాజకీయ లబ్ధి కోసం అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తే, భవిష్యత్తులో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని ఆయన వైసీపీ నేతలను హెచ్చరించారు.

# సైబర్ సెక్యూరిటీ, డాటా ప్రైవసీపై అందరికీ అవగాహన అవసరం: ప్రొఫెసర్ బి. మంజుల



**హన్మకొండ, 13 ఫిబ్రవరి 2026 (జై భీమ్ న్యూస్)**

పింగిళి ప్రభుత్వ డిగ్రీ పీజీ మహిళా కళాశాల (స్వయం ప్రతిపత్తి), హన్మకొండలో కంప్యూటర్ సైన్స్, అప్లికేషన్స్ విభాగం ఆధ్వర్యంలో, పి.ఎం. ఉష (ప్రధానమంత్రి ఉచ్చతర్ శిక్ష అభియాన్) హైదరాబాద్ సహకారంతో నిర్వహించిన రెండు రోజుల జాతీయ సదస్సు ఘనంగా ముగిసింది. "సెక్యూరింగ్ ది డిజిటల్ ఫ్యూచర్: సైబర్ సెక్యూరిటీ అండ్ డేటా ప్రైవసీ ఇన్ హయ్యర్ ఎడ్యుకేషన్" అనే అంశంపై ఈ సదస్సు జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ ప్రొఫెసర్ బి. చంద్రమౌళి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కాకతీయ యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ విభాగం బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్‌పర్సన్ ప్రొఫెసర్ బి. మంజుల మాట్లాడుతూ, సైబర్ సెక్యూరిటీ మరియు డాటా ప్రైవసీపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాల్సిన అవసరం ఉందన్నారు. సైబర్ ముప్పులు, సమాచార భద్రతపై ప్రజలు అప్ర మత్తంగా ఉండాలని, భద్రతా యాప్‌లు సమాచార రక్షణలో ఉపయోగపడ తాయని తెలిపారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న కాకతీయ ప్రభుత్వ డిగ్రీ పీజీ కళాశాల (అటానమస్) హనుమకొండ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి. శ్రీనివాస్ మాట్లాడుతూ, సైబర్ సెక్యూరిటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ క్రైమ్ వంటి అంశాల ప్రాధాన్యాన్ని వివరించారు. ఆర్థిక సంబంధిత సైబర్ నేరాల బాధితులు ఆలస్యం చేయకుండా వెంటనే పోలీసు అధికారులను సంప్రదిస్తే తక్షణ చర్యలు తీసుకునే అవకాశముందని సూచించారు. గౌరవ అతిథిగా హాజరైన నర్సంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్) ప్రిన్సిపాల్, కాకతీయ యూనివర్సిటీ ఈసీ మెంబర్ ప్రొఫెసర్ ఎం. నవీన్ మాట్లాడుతూ, సైబర్ సెక్యూరిటీ, డాటా ప్రైవసీపై ఈ సదస్సు విస్తృత అవగాహన కల్పించిందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి. చంద్రమౌళి మాట్లాడుతూ, సైబర్ సెక్యూరిటీ, నైతిక విలువలు వంటి అనేక అంశాలపై సదస్సులో చర్చలు జరిగాయని, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులకు ఇది ఎంతో ఉపయోగపడిందని తెలిపారు. సెమినార్ కన్వీనర్ డా. డి. సురేష్ బాబు జాతీయ సదస్సు ప్రాధాన్యతను వివరించి, రెండు వందలకు పైగా పరిశోధనా పత్రాలు అందినట్లు తెలిపారు. తదనంతరం అతిథులను శాలువాలు, పుష్పగుచ్ఛాలు, జ్ఞాపికలతో సన్మానించారు. వివిధ కళాశాలల నుండి వచ్చిన ఉపన్యాసకులు, పరిశోధకులు టెక్నికల్ సెషన్‌లో తమ పరిశోధన పత్రాలు సమర్పించగా వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా. జి. సుహాసిని, అకడమిక్ కోఆర్డినేటర్ డా. ఎం. అరుణ, విభాగాధిపతులు, అధ్యాపకులు, బోధన బోధనేతర సిబ్బంది, ఇతర కళాశాలల అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మడకశిర ఎమ్మెల్యేను "డాకూ మహారాజ్" అని పిలిచిన బాలకృష్ణ

**విజయవాడ, జై భీమ్ న్యూస్**

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ తనదైన శైలిలో చమత్కారాలు, వ్యంగ్యాస్త్రాలు సంధించారు. గురువారం సమావేశాల రెండో రోజున అసెంబ్లీ లాబీలో సహచర టీడీపీ ఎమ్మెల్యేలతో సరదాగా ముచ్చటిస్తూ, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజును ఉద్దేశించి "డాకూ మహారాజ్" అని వ్యాఖ్యానించి నవ్వులు పూయించారు. అసెంబ్లీ లాబీలో ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి వాసు, బొజ్జల సుధీర్, ఎంఎస్ రాజుతో బాలకృష్ణ మాట్లాడుతుండగా ఈ సరదా సంభాషణ చోటుచేసుకుంది. హంద్రీనీవా జలాలను మడకశిరకు తీసుకెళుతున్న ఎంఎస్ రాజు 'డాకూ మహారాజ్' అయ్యారని బాలయ్య చమత్కరించారు. దీనికి ఎంఎస్ రాజు స్పందిస్తూ, వెనుకబడిన ప్రాంతమైన తమ నియోజకవర్గ నీటి అవసరాలను అర్థం చేసుకుని పెద్ద మనసు చేసుకోవాలని కోరారు. దీనిపై బాలకృష్ణ బదులిస్తూ, హిందూపురంతో పాటు మడకశిర ప్రజలు కూడా బాగుండాలనేదే తన అభిమతమని స్పష్టం చేశారు. అయితే, ప్రస్తుతం హిందూపురానికి మరో 10 రోజుల పాటు నీటి అవసరం ఉందని ఆయన వివరించారు.

# జాతీయ సెమినార్‌ను విజయవంతం చేయండి

**ఆచార్య వి. రామచంద్రం పిలుపు**





**హన్మకొండ, 13 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

కాకతీయ యూనివర్సిటీ రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో "భారత దేశంలో సరళీకరణ అనంతరం జనరంజక విధానాలు" అనే అంశంపై ఫిబ్రవరి 16, 17 తేదీలలో కేయూ సెనెట్ హాల్‌లో జాతీయ సెమినార్ నిర్వహించనున్నట్లు సెమినార్ డైరెక్టర్, కేయూ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం తెలిపారు. ఈ సెమినార్‌కు విద్యార్థులు, రీసెర్చ్ స్కాలర్స్, మేధావులు, ప్రజాస్వామిక వాదులు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. శుక్రవారం రాజనీతి శాస్త్ర విభాగంలో సెమినార్ విజయవంతం కోసం డిపార్ట్మెంట్ హెచ్.ఓ.డి. డాక్టర్ సంకినేని వెంకటయ్య అధ్యక్షతన సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆచార్య వి. రామచంద్రం మాట్లాడుతూ, రెండు రోజులపాటు జరిగే ఈ జాతీయ సెమినార్‌కు తెలంగాణ ఉన్నత విద్య మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిష్టా రెడ్డి ముఖ్య అతిథిగా, ప్రముఖ సామాజిక తత్వవేత్త, ఓయూ విశ్రాంత ప్రొఫెసర్ కంచ ఐలయ్య ప్రధాన వక్తగా పాల్గొంటారని తెలిపారు. అలాగే ప్రముఖ పత్రిక సంపాదకులు, విశ్లేషకులు కే. శ్రీనివాస్, ఎన్. వేణుగోపాల్ తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు. సెమినార్ విజయవంతం కోసం అధ్యాపకులు, విద్యార్థులు, పరిశోధకులు, నాన్ టీచింగ్ సిబ్బంది సమన్వయంతో కృషి చేయాలని, సెమినార్‌కు హాజరయ్యే ప్రతినిధులు, అతిథులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో రాజనీతి శాస్త్ర విభాగం బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ డాక్టర్ గడ్డం కృష్ణయ్య, అధ్యాపకులు డాక్టర్ వడ్లకొండ సత్యనారాయణ, డాక్టర్ వాడపల్లి నాగరాజు, డాక్టర్ జెట్టి రాజేందర్, రీసెర్చ్ స్కాలర్ బి. నరసింహారావు, జి. సురేష్, రుబీనా, కల్లేపల్లి ప్రశాంత్, అంకిల్ల శంకర్, చందు, కాయిత నాగరాజు, ఎలేందర్ తదితరులు, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.

# జిల్లా సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో వల్లభాపూర్ విద్యార్థుల ప్రతిభ

**జిల్లా స్థాయిలో తృతీయ స్థానం**
**రాష్ట్ర స్థాయికి నిక్షిత్, మన్విత్ ఎంపిక**

**హన్మకొండ, 13 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

జిల్లా స్థాయిలో ఉన్నత పాఠశాల విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు జిల్లా సైన్స్ ఫోరమ్ నిర్వహించిన సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో వల్లభాపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. ఈ పరీక్షలో పాఠశాలకు చెందిన విద్యార్థులు నిక్షిత్, మన్విత్ పాల్గొని జిల్లా స్థాయిలో తృతీయ స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బద్దం సుదర్శన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ, విద్యార్థులు క్రమశిక్షణతో చదువుతూ, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో శ్రద్ధగా సిద్ధమవడంతో ఈ విజయాన్ని సాధించగలిగారని అన్నారు. శాస్త్రవిజ్ఞానంపై ఆసక్తి పెంపొందించుకునే విద్యార్థులకు ఇలాంటి పరీక్షలు మంచి అవకాశాలను కల్పిస్తాయని తెలిపారు. భవిష్యత్తులో రాష్ట్ర స్థాయిలో కూడా మెరుగైన ఫలితాలు సాధించి పాఠశాలకు మరింత పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థుల విజయాన్ని పురస్కరించుకుని జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.వి. గిరిరాజ్ గౌడ్ వారిని అభినందించారు. ఈ సందర్భంగా నిక్షిత్, మన్విత్‌లకు ప్రశంసా పత్రాలు అందజేసి, వారి ప్రతిభను కొనియాడారు. అలాగే విద్యార్థులను సిద్ధం చేయడంలో కీలక పాత్ర పోషించిన సైన్స్ ఉపాధ్యాయులు వెంకట స్వామి, కళ్యాణి గార్లను కూడా ప్రత్యేకంగా అభినందించారు. ఉపాధ్యాయుల కృషి, విద్యార్థుల పట్టుదల కలిసి మంచి ఫలితాలను అందించాయని ఆయన పేర్కొన్నారు. ఈ విజయంతో పాఠశాలలో ఆనంద వాతావరణం నెలకొంది. సహ విద్యార్థులు, ఉపాధ్యాయులు నిక్షిత్, మన్విత్‌లను అభినందిస్తూ, రాష్ట్ర స్థాయిలో కూడా ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు.



గ్రామ ప్రజలు, తల్లిదండ్రులు కూడా విద్యార్థుల విజయంపై హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర స్థాయి పోటీలలో కూడా మంచి ఫలితాలు సాధించి జిల్లాకు, పాఠశాలకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని అందరూ ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## మార్చి 2024 తర్వాత రిటైర్ అయిన పెన్షనర్ల బకాయిలు వెంటనే చెల్లించాలి: ఎస్‌జీపీఏటీ






**వరంగల్, 13 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

2024 మార్చి తర్వాత ఉద్యోగ విరమణ చేసిన పెన్షనర్లకు పెన్షన్ బకాయిలను తక్షణమే చెల్లించాలని, అలాగే ఉద్యోగ విరమణకు ముందు రావలసిన డియర్‌నెస్ అలవెన్స్ (డీఏ) బకాయిలను ఒకే విడతలో ఏకమొత్తంగా చెల్లించాలని స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ తెలంగాణ (ఎస్‌జీపీఏటీ) రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి వెలిశోజు రామమనోహర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్రు సుధీర్ బాబు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రంగశాయి పేట/శంభుని పేట పెన్షనర్ల సమావేశం సీనియర్ పెన్షనర్ వలబోజు సోమేశ్వరరావు అధ్యక్షతన గురువారం స్థానిక గ్రంథాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ, లక్షలాది మంది ఉద్యోగులు, పెన్షనర్లు ఎదురుచూస్తున్న పీఆర్‌సీ గడువు ముగిసి రెండున్నర సంవత్సరాలు గడిచినా ప్రభుత్వం స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు. పెన్షన్ బకాయిలు అందకుండానే పలువురు పెన్షనర్లు మరణించారని, అయినప్పటికీ పెన్షనర్ల సమస్యలపై ప్రభుత్వ వైఖరిలో మార్పు కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఎస్‌జీపీఏటీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు తుమ్మ వీరయ్య, ప్రధాన కార్యదర్శి గునిగంటి సాంబయ్య ఆధ్వర్యంలో రంగశాయి పేట/శంభుని పేట యూనిట్ (వరంగల్ జిల్లాలో 12వ యూనిట్) ఎన్నికలు నిర్వహించగా, కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. యూనిట్ అధ్యక్షుడిగా జడల చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా ఆర్. వెంకటాచలం ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా ఎం. నరసింహాచారి, బొల్లోజు కృష్ణమూర్తి, టి. శారదాభాయి, కార్యదర్శులుగా పి. లక్ష్మీనారాయణ, సి.హెచ్. వెంకటనారాయణ, ఆర్థిక కార్యదర్శిగా పి. పరిపూర్ణాచారి ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా జి. బాబూరావు, యన్. బాలకృష్ణ, టి. చంద్రయ్య, ఎం.డి. ఇస్మాయిల్, కొంగరి లక్ష్మీనారాయణలను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు పెట్లోజు పరమేశ్వర్, ఆర్థిక కార్యదర్శి యన్. సదానందం, పి. పెద్దన్న, అల్లం వేణుమాధవ్, వేల్పుల రవీందర్, కె. కృష్ణమూర్తి తదితరులు సహా సుమారు 45 మంది పెన్షనర్లు పాల్గొన్నారు.

## వీరశైవ లింగాయతులు ధర్మాచరణతో ఆదర్శంగా నిలవాలి

### దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ సునీత



**వరంగల్, ఫిబ్రవరి 13 (జై భీమ్ న్యూస్)**

మహాత్మా బసవేశ్వరుని మార్గదర్శనంలో వీరశైవ లింగాయతులు ధర్మాచరణ పాటిస్తూ సమాజానికి ఆదర్శప్రాయంగా నిలవాలని దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ సునీత పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం వరంగల్‌లోని చారిత్రాత్మక వేయి స్తంభాల దేవాలయం ప్రాంగణంలో రాష్ట్ర వీరశైవ లింగాయత్/లింగ బలిజ సంఘం రూపొందించిన 2026 సంవత్సర డైరీని డిప్యూటీ కమిషనర్ సునీత, ఆలయ ప్రధాన అర్చకులు మరియు రాష్ట్ర అర్చక సమాఖ్య అధ్యక్షులు గంగు ఉపేంద్ర శర్మతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లింగాయత్ సమాజానికి సంబంధించిన పూర్తి సమాచారంతో ప్రత్యేక ఆకర్షణీయంగా డైరీని రూపకల్పన చేయడం అభినందనీయమని సునీత తెలిపారు. సమాజానికి ఉపయోగపడే విధంగా ఇలాంటి ప్రచురణలు మరింతగా రావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్ర శర్మ మాట్లాడుతూ వీరశైవులు సహజంగా శివుడిని ఆరాధిస్తూ, మహాత్మా బసవేశ్వరుడి స్ఫూర్తితో భక్తి భావంతో జీవిస్తూ సమాజ హితం కోసం సమభావంతో జీవనం గడపడం వారి ప్రత్యేకత అని పేర్కొన్నారు. డైరీ ఆవిష్కరణ కార్యక్రమంలో భాగస్వామ్యం కావడం సంతోషకరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీరశైవ లింగాయత్ సంక్షేమ సంఘం హనుమకొండ జిల్లా ప్రతినిధులు పట్నం శెట్టి వీర సోమయ్య, నానం రాజయ్య, గుండవరం విధుమౌళి, పట్నం శెట్టి శైలేష్ ప్రసాద్, దుర్గమ్మ సమ్మయ్య, పెనాల సమ్మయ్య, వెన్న కోటేశ్వరరావు, సాయం సాంబయ్య, దుర్గం మల్లికార్జున్, యువజన కమిటీ అధ్యక్షులు వుప్పు శివకుమార్ (సునీల్), రాచర్ల సాయి, వుప్పు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత సిలిండర్ వెనక ఎన్నో రహస్యాలు




**వికారాబాద్ జిల్లా జై భీమ్ న్యూస్:**

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళలకు ఉజ్వల 2. ఓ ఉచిత గ్యాస్ సిలిండర్ పథకంలో ఎన్నో రహస్యాలు దాగున్నాయి అని వికారాబాద్ జిల్లా దోమ మండలం హెచ్. పీ గ్యాస్ అధికారులు తెలిపారని మండలంలోని పలు గ్రామస్తులు వాపోయారు. దోమ హెచ్. పీ గ్యాస్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇప్పుడు వచ్చిన కొత్త రేషన్ కార్డు వచ్చిన రేషన్ కార్డు దారులు, ఇంతకుముందు ఉన్న రేషన్ కార్డు లో ఎవరికైనా ఉచిత గ్యాస్ సిలిండర్ వచ్చి ఉంటే, ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన రేషన్ కార్డు సపరేట్ అయినా కూడా మీకు ఉచిత సిలిండర్ రాదు, డబ్బులు పెట్టి కొన్న కూడా పాత కార్డులో ఉంటే రాదు అని చెబుతున్నారు. మోత్కూర్ గ్రామానికి చెందిన బ్యాగరి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఇంతకు ముందు గ్యాస్ కనెక్షన్ ఉన్న కూడ, ఇంట్లో కొత్తగా వచ్చిన రేషన్ కార్ట్ ల వచ్చిన అభ్యర్థులు ఇద్దరు అన్నదమ్ములకు ఇద్దరికి వస్తున్నాయి, కానీ ఇంతకు ముందు లేని వారికి కూడా ఉచిత గ్యాస్ సిలిండర్ లు వస్తలేవు దీని వెనక ఏమో జరుగుతుంది, మరి రికమండేషన్ మీద వస్తున్నాయా నింజాగానే ఏదో లోటు ఉన్నందువలన రావట్లేదా..! అని దరఖాస్తు దారుల అభిప్రాయం అని మండిపడ్డారు. ఎన్ని సార్లు అడిగినా అదే సమాధానం చెబుతున్నారు. పెళ్లై 10 ఏళ్ళు అయినా, విడిగా కాపురం పెట్టుకున్న మీకు ఇంతకు ముందు ఉన్న మీ రేషన్ కార్డు లో ఉచిత గ్యాస్ కనెక్షన్ ఉంటే రాదు అని జవాబు జారీ చేస్తున్నారు. మాకు పెళ్ళిళ్ళు అయ్యి 12, 15 ఏళ్ళ పిల్లలు కూడా ఉన్నారు, ఇంకా మాకు మాకు పాత రేషన్ కార్డు తో సంబంధం ఉంటే, మాకు డబ్బులు పెట్టీ కొన్న కూడా మీకు రాదు అంటే జీవితాంతం మేము గ్యాస్ వాడొద్దా..? అని ప్రశ్నిస్తున్నారు మోత్కూర్ గ్రామస్తులు. వెనక నుంచి దరఖాస్తు చేసుకున్న వారికి వస్తుంటే మా దరఖాస్తు ఫైల్ పక్కల పడేశారా అనే ఆందోళన కలిగిస్తుంది అని అంటున్నారు.

## పవన్ కల్యాణ్‌ను కలిసిన నందమూరి బాలకృష్ణ, నాగబాబు!

**ఉప ముఖ్యమంత్రి ఛాంబర్‌లో పవన్ కల్యాణ్‌తో మర్యాదపూర్వక భేటీ**
**పవన్ కల్యాణ్‌తో మొదట బాలకృష్ణ, ఆ తర్వాత నాగబాబు సమావేశం**
**గిద్దలూరు నియోజకవర్గ సమస్యలపై ఎమ్మెల్యే అశోక్ రెడ్డి వినతిపత్రం అందజేత**

**విజయవాడ, జై భీమ్ న్యూస్**

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌ను హిందూపురం టీడీపీ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, జనసేన ఎమ్మెల్సీ నాగబాబు వేర్వేరుగా కలిశారు. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఉప ముఖ్యమంత్రి ఛాంబర్‌లో బాలకృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఇరువురు ప్రస్తుత పరిణామాలు, వివిధ అంశాలపై చర్చించినట్లుగా సమాచారం. ఆ తర్వాత నాగబాబు కూడా సోదరుడిని కలిశారు. అంతకుముందు, శాసనసభలో మంత్రి లోకేశ్, నందమూరి బాలకృష్ణ పక్కపక్కనే కూర్చుని మాట్లాడుకోవడం అందరి దృష్టిని ఆకర్షించింది. బాలకృష్ణ ఏదో చెబుతుండగా లోకేశ్ ఆసక్తిగా వింటున్నట్లు కనిపించింది. ఇదిలా ఉండగా, గిద్దలూరు నియోజకవర్గం సమస్యలపై పవన్ కల్యాణ్‌కు ఎమ్మెల్యే అశోక్ రెడ్డి వినతి పత్రం అందజేశారు.

## నర్సంపేట మున్సిపాలిటీలో 30 వార్డుల ఫలితాలు ప్రకటింపు

**కాంగ్రెస్‌కు అధిక స్థానాలు**

**వరంగల్, 13 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**


వరంగల్ జిల్లాలోని నర్సంపేట మున్సిపాలిటీలో జరిగిన మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యి, మొత్తం 30 వార్డుల ఎన్నికల ఫలితాలను ఎన్నికల అధికారులు అధికారికంగా ప్రకటించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం కౌంటింగ్ నిర్వహించి, ఫలితాలను ధృవీకరించిన అనంతరం వెల్లడించినట్లు అధికారులు తెలిపారు. ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన అభ్యర్థులు అధిక స్థానాల్లో విజయం సాధించగా, బీఆర్ఎస్, బీజేపీ, సీపీఎం, స్వతంత్ర అభ్యర్థులు కూడా కొన్ని వార్డుల్లో గెలుపొందారు. మున్సిపాలిటీ పరిధిలో మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు కేటాయించిన రిజర్వేషన్ల ప్రకారం అభ్యర్థులు ఎన్నికయ్యారు. అధికారులు విడుదల చేసిన జాబితా ప్రకారం 1వ వార్డు నుండి 30వ వార్డు వరకు మేఘనా కోతకొండ, కంపెల్లి వీణ, ముత్తినేని వెంకన్న, బీరం భరత్, మణిషా పొన్నాల, నర్సింహారెడ్డి పున్నం, గంధం నరేందర్, డొంగల రాజిత, కీర్తి కట్ట, శ్రీధర్ హనుమకొండ, స్వరూప చెకాటి, రామ ఎస్లావత్, భూక్య మత్రు రాథోడ్, బూసా శిరీష, ఎపూరి శ్రీనివాస్ రెడ్డి, బానోత్ నవీన్ నాయక్, సలావుద్దీన్ అయూబ్ ఖాన్, ధోమ్మతి రమ్య, విజయ్ కుమార్ ఎలకంటి, శ్రీరామోజు రోజారాణి, శివరాత్రి స్వామి, బనాల ప్రసన్న కుమార్, వెల్పుల శ్రీలత, రాజేందర్ బతినీ, పెండెం శ్రీలక్ష్మి, మండల శ్రీదేవి, వినోద ములకాల, జులూరి రోజారాణి, వేముల సంధ్య, మాదాసి రవి వార్డు సభ్యులుగా ఎన్నికయ్యారు. కౌంటింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాల పర్యవేక్షణ, బలమైన పోలీస్ బందోబస్తు, అభ్యర్థులు మరియు వారి ప్రతినిధులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో కౌంటింగ్ ప్రక్రియ సజావుగా పూర్తయిందని అధికారులు తెలిపారు. ఎన్నికల నిర్వహణలో పాల్గొన్న రెవెన్యూ, పోలీస్, మున్సిపల్ మరియు ఇతర శాఖల అధికారుల సమన్వయంతో ఎలాంటి అంతరాయాలు లేకుండా ప్రక్రియ పూర్తయిందని పేర్కొన్నారు. ఎన్నికైన వార్డు సభ్యులు త్వరలో పదవీ బాధ్యతలు స్వీకరించి పట్టణ అభివృద్ధికి కృషి చేయాలని స్థానిక ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## కాన్సెప్ట్ బాగుంది కానీ... అందులో వాస్తవం లేదు: దర్శకుడు క్రిష్

**దర్శకుడు క్రిష్ జాగర్లమూడి తదుపరి మూవీపై సోషల్ మీడియాలో వదంతులు**
**వదంతులపై తనదైన శైలిలో స్పందించిన క్రిష్ జాగర్లమూడి**
**తన కొత్త సినిమా వివరాలను త్వరలోనే అధికారికంగా వెల్లడిస్తానన్న క్రిష్ జాగర్లమూడి**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

దర్శకుడు క్రిష్ జాగర్లమూడి తదుపరి మూవీ అడ్వెంచర్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కనుందని, అందులో ఏడుగురు హీరోయిన్లు నటించనున్నారనే వార్తలు ఇటీవల సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టాయి. ఈ ప్రచారంపై స్పందించిన క్రిష్.. ఏడుగురు హీరోయిన్లు, ట్రెక్కింగ్ అడ్వెంచర్.. ఐడియా బాగుంది, కానీ ఇది నిజం కాదని అన్నారు. సోషల్ మీడియాలో పుట్టిన మరో స్క్రిప్ట్ మాత్రమేనంటూ వదంతులకు తనదైన శైలిలో ఫుల్‌స్టాప్ పెట్టారు. తన కొత్త సినిమా వివరాలను త్వరలోనే అధికారికంగా వెల్లడిస్తానని చెప్పారు. గమ్యం మూవీతో దర్శకుడిగా పరిచయమైన క్రిష్, ఆ మూవీతో తెలుగు ఆడియన్స్‌కు కొత్త అనుభూతిని అందించిన సంగతి తెలిసిందే. తరువాత వేదం, కృష్ణం వందే జగద్గురుమ్ వంటి ఆలోచనాత్మక చిత్రాలు, అలాగే కథానాయకుడు (ఎన్టీఆర్) వంటి బయోపిక్‌ను తెరకెక్కించారు. ఆయన దర్శకత్వంలో వచ్చిన హరి హర వీరమల్లు, ఘాటి మూవీలు గత ఏడాది విడుదలయ్యాయి.




# నాలాగే ఎందరో కన్నీళ్లు పెట్టుకున్నారు

**ప్రజలు అన్నీ గమనించి తీర్పు ఇచ్చారు: సీఎం చంద్రబాబు**
**గత పాలనలో భూ వివాదాలపైనే ఎక్కువ ఫిర్యాదులు అందాయన్న సీఎం**
**2026 నాటికి రెవెన్యూ రికార్డుల ప్రక్షాళన చేపడతామని వెల్లడి**
**తిరుపతి లడ్డూ వివాదంలోకి హెరిటేజ్‌ను లాగి బ్రాండ్ దెబ్బతీశారని ఆగ్రహం**
**ప్రత్యర్థిని ఆర్థికంగా దెబ్బతీయడమే ఫ్యాక్షనిస్టుల లక్ష్యమని వ్యాఖ్యలు**
**దేవాలయాల పవిత్రతను కాపాడతామని స్పష్టీకరణ**

**విజయవాడ, జై భీమ్ న్యూస్**

గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై అసెంబ్లీలో చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు గత వైసీపీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గత ఐదేళ్ల పాలనలో జరిగిన విధ్వంసం నుంచి రాష్ట్రం ఇప్పుడిప్పుడే కోలుకుంటోందని, పాలకులు అసెంబ్లీలో తనను అవమానించిన తీరుకు కన్నీళ్లు పెట్టుకున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. తనలాగే 2019-24 మధ్య ఎందరో కన్నీళ్లు పెట్టుకున్నారని, ప్రజలు అన్నింటినీ గమనించి సరైన సమయంలో తీర్పు ఇచ్చారని అన్నారు. రాష్ట్రంలో జరిగిన విధ్వంసంపై అధికారంలోకి రాగానే 7 శ్వేతపత్రాలు విడుదల చేశామని గుర్తుచేశారు. "మేము అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మాకు అందిన ఫిర్యాదుల్లో అత్యధికం భూ వివాదాలకు సంబంధించినవే. గత పాలకులు అడిగిన భూములు ఎవరైనా ఇవ్వకపోతే, వాటిని వెంటనే 22ఏ జాబితాలో పెట్టేసి వేధించారు. స్వయంగా చట్టాలు చేసిన ముఖ్యమంత్రే ఇలా చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే బాధితులు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాని పరిస్థితి నెలకొంది. తాడేపల్లి ప్యాలస్ సమీపంలో హెలిప్యాడ్, అప్రోచ్ రోడ్ నిర్మాణం కోసం ఓ భూమి అడిగారు. అది ఇవ్వలేదని బలవంతంగా 22ఏలో చేర్చేశారు. రూ.33 లక్షలతో నిర్మాణం కోసం జీవో కూడా ఇచ్చేశారు. గత పాలకులు చేసిన పాపాలు కడగడానికే మాకు ఏడాది సమయం పట్టింది. మదనపల్లిలోని ఆర్డీఓ కార్యాలయంలో రెవెన్యూ రికార్డులను తగులబెట్టడం వాళ్ల అరాచకాలకు నిదర్శనం. అందుకే, 2026 నాటికి ఈ రెవెన్యూ రికార్డులన్నీ ప్రక్షాళన చేసి, ప్రతి ఒక్కరి భూమికి భద్రత కల్పించేలా రాజముద్రతో కొత్త పాస్ పుస్తకాలు జారీ చేయాలని నిర్ణయించాం. భూములే కాదు, ఇసుకను కూడా వదలకుండా దోపిడీ చేశారు. తిరుపతి లడ్డూ వ్యవహారం చాలా సున్నితమైన అంశం. ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందువులు పవిత్రంగా భావించే శ్రీవారి దర్శనం, ప్రసాదం విషయంలోనూ వాళ్లు రాజకీయాలు చేశారు. దేవుడి పవిత్రతను, భక్తుల మనోభావాలను దెబ్బతీయాలని ప్రయత్నించారు. జరిగిన తప్పులను మేం చెప్పకుండా ఉంటే, ఆ అపవిత్రతను కొనసాగించడానికి వాళ్లు వెనుకాడరు. అందుకే, టీటీడీ సహా అన్ని దేవాలయాల్లో పవిత్రతను కాపాడే బాధ్యతను మా కూటమి ప్రభుత్వం తీసుకుంటుంది. వివేకా హత్య కేసులో వాళ్లు ఎన్ని నాటకాలు ఆడారో అందరూ చూశారు. 'నారాసుర రక్త చరిత్ర' అంటూ సాక్షి పత్రికలో రాసి, ఆ నేరాన్ని మాపై నెట్టాలని చూశారు. ఇప్పుడు అదే తరహాలో కల్తీ నెయ్యి వివాదాన్ని మా కుటుంబ సంస్థ అయిన హెరిటేజ్‌కు అంటగట్టి, బ్రాండ్ ప్రతిష్టను దెబ్బతీయాలని కుట్ర చేస్తున్నారు. గతంలో రాయలసీమలో ఫ్యాక్షన్ రాజకీయాల్లో భాగంగా ప్రత్యర్థులను ఆర్థికంగా దెబ్బతీయడానికి చీనీ చెట్లను నరికివేసేవారు. ఇప్పుడు అదే ఫ్యాక్షన్ బుద్ధితో మా వ్యాపారాన్ని దెబ్బతీయాలని చూస్తున్నారు. శాంతిభద్రతల విషయంలో మేం కఠినంగా వ్యవహరిస్తాం. రాజకీయ ముసుగులో నేరాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదు" అని చంద్రబాబు హెచ్చరించారు.



# ఒకే కాలనీలో 6 పార్కులను కాపాడిన హైడ్రా

**హైదరాబాద్‌లో పార్కుల కబ్జాలపై హైడ్రా ఉక్కుపాదం**
**ఒకేరోజు రూ.34 కోట్ల విలువైన 3041 గజాల భూముల స్వాధీనం**
**భాగ్యలక్ష్మి కాలనీలో 6 పార్కులు, గుడిమల్కాపూర్‌లో ఒక పార్కుకు విముక్తి**
**హైడ్రా చర్యలతో స్థానికుల సంబరాలు, భారీ ర్యాలీలు**
**ప్రజావాణి ఫిర్యాదులపై కమిషనర్ రంగనాథ్ ఆదేశాలతో వేగంగా స్పందన**



**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

హైదరాబాద్ నగరంలో ప్రజా ప్రయోజనాల కోసం కేటాయించిన పార్కుల స్థలాల కబ్జాపై హైడ్రా ఉక్కుపాదం మోపింది. ప్రజలకు ప్రాణవాయువును అందించే పచ్చని ప్రదేశాలను కాపాడేందుకు నడుం బిగించింది. శుక్రవారం ఒక్కరోజే రెండు వేర్వేరు ప్రాంతాల్లో మెరుపు దాడులు నిర్వహించి సుమారు రూ. 34.12 కోట్ల విలువైన 3,041 గజాల పార్కు స్థలాలను కబ్జాదారుల చెర నుంచి విడిపించింది. హైడ్రా తీసుకున్న ఈ చర్యలతో స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నారు. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా, కుత్బుల్లాపూర్ పరిధిలోని సుభాష్ నగర్‌లో ఉన్న భాగ్యలక్ష్మి కాలనీలో హైడ్రా అధికారులు కీలక ఆపరేషన్ చేపట్టారు. 1968లో వేసిన ఈ లేఅవుట్‌లో పార్కుల కోసం కేటాయించిన స్థలాలు కాలక్రమేణా కబ్జాకు గురయ్యాయి. గతంలో ఈ ప్రాంతం మీదుగా వెళ్లే హైటెన్షన్ విద్యుత్ లైన్లను 20 ఏళ్ల క్రితం తొలగించడంతో, అప్పటి నుంచి పార్కుల స్థలాలు ఆక్రమణకు గురవుతూ వచ్చాయి. స్థానిక అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో, నివాసితులు హైడ్రా ప్రజావాణిని ఆశ్రయించారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు రంగంలోకి దిగిన అధికారులు, క్షేత్రస్థాయిలో విచారణ జరిపి ఆక్రమణలను నిర్ధారించుకున్నారు. శుక్రవారం ఒకేసారి 6 పార్కులలోని ఆక్రమణలను తొలగించి, 2260 గజాల స్థలానికి 'హైడ్రా ఫెన్సింగ్' వేసి, అధికారిక బోర్డులు ఏర్పాటు చేశారు. దీంతో కాలనీవాసులు ఆనందంతో ర్యాలీలు తీసి, హైడ్రాకు అనుకూలంగా నినాదాలు చేశారు. ఇదే తరహాలో, ఆసిఫ్‌నగర్ మండలం గుడిమల్కాపూర్ గ్రామంలోని ఏజీ ఆఫీస్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లేఅవుట్‌లో దశాబ్దాలుగా కబ్జాలో ఉన్న పార్కు స్థలాన్ని హైడ్రా కాపాడింది. గతంలో లోతట్టు ప్రాంతంగా ఉన్న ఈ 1,152 గజాల స్థలాన్ని పార్కు కోసం కేటాయించారు. అయితే, కొందరు వ్యక్తులు దానిని ఆక్రమించుకుని ఇసుక వ్యాపారం, వాహనాల పార్కింగ్, కొబ్బరి బొండాల అమ్మకాలకు వినియోగిస్తున్నారు. 2018లో జీహెచ్ఎంసీకి ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకపోవడంతో, స్థానికులు హైడ్రాను సంప్రదించారు. ప్రజావాణి ఫిర్యాదు ఆధారంగా హైడ్రా అధికారులు కబ్జాదారులను ఖాళీ చేయించి, స్థలాన్ని స్వాధీనం చేసుకుని ఫెన్సింగ్ వేశారు. ప్రజా ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, ప్రభుత్వ ఆస్తులను కాపాడటంలో హైడ్రా తన నిబద్ధతను చాటుకుంటోందని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

# మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభంజనం..

**అనేకచోట్ల హంగ్.. క్యాంపు రాజకీయాలకు తెర!**
**తెలంగాణ పురపాలక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ హవా**
**మొత్తం 116 మున్సిపాలిటీల్లో 62 చోట్ల హస్తం పార్టీకి స్పష్టమైన మెజారిటీ**
**పలుచోట్ల హంగ్ ఫలితాలు రావడంతో క్యాంపు రాజకీయాలకు తెరలేపిన పార్టీలు**
**కార్పొరేషన్లలోనూ కాంగ్రెస్ హవా.. కీలక స్థానాల్లో పట్టు నిలుపుకున్న బీజేపీ**
**చైర్మన్లు, మేయర్ల ఎన్నిక కోసం సోమవారం ప్రత్యేక సమావేశాలు**



**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

తెలంగాణలో జరిగిన మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం సృష్టించింది. శుక్రవారం జరిగిన ఓట్ల లెక్కింపులో స్పష్టమైన ఆధిక్యం కనబరుస్తూ, రాష్ట్రంలోని పట్టణ ఓటర్లు తమకే పట్టం కట్టారని నిరూపించుకుంది. మొత్తం 116 మున్సిపాలిటీలకు గాను, కాంగ్రెస్ పార్టీ ఏకంగా 62 చోట్ల విజయం సాధించి జెండా ఎగరేసింది. మరోవైపు, ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ కేవలం 12 మున్సిపాలిటీలతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ ఒక మున్సిపాలిటీని కైవసం చేసుకుంది. మరో నాలుగు మున్సిపాలిటీల ఫలితాలు వెలువడాల్సి ఉంది. ఈ ఎన్నికల్లో అత్యంత ఆసక్తికరమైన అంశం హంగ్ ఫలితాలు. సుమారు 37 మున్సిపాలిటీల్లో ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాకపోవడంతో, చైర్మన్, వైస్ చైర్మన్ పదవుల కోసం తీవ్రమైన పోటీ నెలకొంది. దీంతో ఇండిపెండెంట్లు, ఇతర పార్టీల సభ్యులను తమవైపు తిప్పుకునేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు క్యాంపు రాజకీయాలకు తెరలేపాయి. ఇది రాబోయే రోజుల్లో రాజకీయ వేడిని మరింత పెంచనుంది. మున్సిపాలిటీలతో పాటు ఏడు కార్పొరేషన్లలోనూ కాంగ్రెస్ పార్టీ తన హవాను కొనసాగించింది. మంచిర్యాల, రామగుండం, నల్గొండ కార్పొరేషన్లలో స్పష్టమైన మెజారిటీ సాధించగా, మహబూబ్‌నగర్‌లో ఆధిక్యంలో కొనసాగుతోంది. కొత్తగూడెం కార్పొరేషన్‌లో కాంగ్రెస్, సీపీఐ చెరో 22 స్థానాలు గెలుచుకుని సమ ఉజ్జీలుగా నిలిచాయి. మరోవైపు, బీజేపీ తమకు బలమైన పట్టున్న నిజామాబాద్, కరీంనగర్ కార్పొరేషన్లలో ఆధిక్యం ప్రదర్శించింది. ఈ రెండు ప్రాంతాలు బీజేపీ సిట్టింగ్ లోక్‌సభ స్థానాలు కావడం గమనార్హం. వార్డుల వారీగా చూస్తే, మొత్తం 2,582 మున్సిపల్ వార్డులకు గాను, శుక్రవారం సాయంత్రం 4:30 గంటల వరకు 2,543 స్థానాల ఫలితాలు వెలువడ్డాయి. వీటిలో కాంగ్రెస్ 1,325 వార్డులు గెలుచుకోగా, బీఆర్ఎస్ 707, బీజేపీ 260 వార్డుల్లో విజయం సాధించాయి. ఎంఐఎం, ఇండిపెండెంట్లు కలిపి 251 స్థానాలను దక్కించుకున్నారు. కార్పొరేషన్ల పరిధిలోని 414 డివిజన్లకు గాను వెలువడిన 291 ఫలితాల్లో, కాంగ్రెస్ 154, బీఆర్ఎస్ 49, బీజేపీ 34, ఇతరులు 54 స్థానాలు కైవసం చేసుకున్నారు. బుధవారం జరిగిన పోలింగ్‌లో 73 శాతానికి పైగా ఓటింగ్ నమోదైంది. మున్సిపాలిటీల్లో 75.88 శాతం, కార్పొరేషన్లలో 66.05 శాతం పోలింగ్ జరిగింది. కాగా, మున్సిపల్ చైర్మన్లు, మేయర్ల ఎన్నికకు సంబంధించిన నోటిఫికేషన్‌ను శనివారం జారీ చేయనున్నారు. కొత్తగా ఎన్నికైన కౌన్సిలర్లు, కార్పొరేటర్లు ఫిబ్రవరి 16న (సోమవారం) ప్రమాణ స్వీకారం చేసి, అదే రోజు చైర్మన్లు, వైస్ చైర్మన్లు, మేయర్లు, డిప్యూటీ మేయర్లను ఎన్నుకోనున్నారు.

# కేసీఆర్‌ను కూడా ప్రజలు ఓడించారు

**రేవంత్ రెడ్డి 'నేనే రాజు' వ్యాఖ్యలపై కేటీఆర్ కౌంటర్**
**నేనే రాజు నేనే మంత్రి అన్న రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై కేటీఆర్ స్పందన**
**అలా అనుకున్న వారు ఎందరో గాలికి కొట్టుకుపోయారన్న కేటీఆర్**
**తెలంగాణ సాధించిన కేసీఆర్‌ను కూడా కామారెడ్డిలో ప్రజలు ఓడించారన్న కేటీఆర్**



**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

తెలంగాణకు 'నేనే రాజు నేనే మంత్రి' అన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాలు వెలువడిన నేపథ్యంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, 'నేనే రాజు నేనే మంత్రి' అనుకునే పిచ్చి తుగ్లక్‌లు చాలామంది ఉంటారని, చరిత్రలో కూడా ఒక తుగ్లక్ ఉండేవాడని ఎద్దేవా చేశారు. అలా అనుకున్నవారు ఎందరో గాలికి కొట్టుకుపోయారని అన్నారు. ప్రజల చైతన్యాన్ని ఎవరూ తక్కువ అంచనా వేయవద్దని అన్నారు. ఈ దేశంలో ఇందిరాగాంధీ, ఎన్టీఆర్ వంటి నాయకులు సైతం ఓడిపోయారని గుర్తు చేశారు. తెలంగాణ సాధించిన కేసీఆర్ వంటి నాయకుడిని కూడా కామారెడ్డిలో దురదృష్టవశాత్తూ ప్రజలు ఓడించారని అన్నారు. అక్కడ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మూడో స్థానానికి వచ్చారని గుర్తు చేశారు. ఇలా నేనే రాజు నేనే మంత్రి అని రేవంత్ రెడ్డిలా విర్రవీగిన వాళ్లు వచ్చారు, పోయారని... కానీ దేశం, ప్రజల చైతన్యం అలాగే ఉందన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేల విషయంలో తాము పూర్తి స్పష్టతతో ఉన్నామని కేటీఆర్ అన్నారు. తన ప్రభుత్వంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అంత విశ్వాసం ఉంటే పార్టీ మారిన ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి తిరిగి ఉప ఎన్నికలకు రావాలని సవాల్ చేశారు. పదిచోట్ల ఉప ఎన్నికలు వస్తే అప్పుడు ప్రజలు తేల్చుతారని అన్నారు.

# మా గెలుపుతో కల్వకుంట్ల కవితకు సంబంధం లేదు

**వడ్డేపల్లి శ్రీనివాస్ సంచలన వ్యాఖ్యలు**
**వడ్డేపల్లి మున్సిపాలిటీని కైవసం చేసుకున్న పార్వర్డ్ బ్లాక్**
**ఫార్వర్డ్ బ్లాక్ తరపున పోటీ చేసిన కవిత మద్దతుదారులు**
**కవిత తమ తరపున ప్రచారం చేయలేదన్న శ్రీనివాస్**


**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మున్సిపాలిటీలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత మద్దతు పలికిన ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీకి చెందిన అభ్యర్థులు విజయకేతనం ఎగురవేశారు. మొత్తం 10 వార్డులకు గాను 8 వార్డుల్లో సింహం గుర్తుపై గెలిచి సంచలనం సృష్టించారు. ఈ గెలుపు చర్చనీయాంశంగా మారుతున్న వేళ, కవిత విజయం గురించి చర్చ ప్రారంభమైన వేళ... ఆమెకు షాక్ తగిలింది. తమ విజయంతో కవితకు ఎలాంటి సంబంధం లేదని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ తరపున గెలిచిన వడ్డేపల్లి శ్రీనివాస్ సంచలన వ్యాఖ్యలు చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించిన అనంతరం ఓ న్యూస్ చానల్ తో వడ్డేపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ... తమ విజయంతో జాగృతికి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ నుంచి బీఫారం తీసుకోవడానికి వెళ్లినప్పుడు కవిత తమకు జాగృతి కండువా కప్పారని... కానీ, ఆమె తమ తరపున ప్రచారానికి వచ్చిందే లేదని చెప్పారు. ప్రచారంలో తాము కవిత కండువా వేసుకున్నది కూడా లేదని, ఆ రోజు తర్వాత కవితతో తాము మాట్లాడింది కూడా లేదని తెలిపారు. ఈ గెలుపు తమ సొంతమని చెప్పారు. శ్రీనివాస్ వ్యాఖ్యలపై కవిత ఎలా స్పందిస్తారో వేచి చూడాలి.

# 6 మున్సిపాలిటీల్లో బీజేపీ సింగిల్ లార్జెస్ట్ పార్టీ...

**కరీంనగర్, నిజామాబాద్ గెలుస్తున్నాం: రామచందర్ రావు**
**ఈ ఎన్నికల్లో బీజేపీ బలపడిందన్న రామచందర్ రావు**
**హంగ్ వచ్చినా బీజేపీ ఎవరికీ మద్దతివ్వదని స్పష్టీకరణ**
**తెలంగాణలో కచ్చితంగా అధికారంలోకి వస్తామని ధీమా**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**



ఆరు మున్సిపాలిటీల్లో బీజేపీ సింగిల్ లార్జెస్ట్ పార్టీగా అవతరించిందని, రెండు కార్పొరేషన్లు గెలుచుకోబోతున్నామని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు అన్నారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఈ ఎన్నికల్లో బీజేపీ బలపడిందని అన్నారు. ఎక్కువ సీట్లు, ఓట్లు సాధించామని ఆయన వ్యాఖ్యానించారు. ఇప్పటి వరకు వెలువడిన ఫలితాల్లో 250 వార్డుల్లో గెలిచామని పేర్కొన్నారు. కరీంనగర్, నిజామాబాద్ మున్సిపాలిటీలను కైవసం చేసుకోబోతున్నామని వ్యాఖ్యానించారు. నారాయణపేట, ఆదిలాబాద్, రాయికల్ వంటి మున్సిపాలిటీల్లో బీజేపీ వారే ఛైర్మన్లు అవుతారని ధీమా వ్యక్తం చేశారు. ఎక్స్ అఫిషియో, స్వతంత్ర అభ్యర్థుల మద్దతుతో ఛైర్మన్ పదవులు దక్కించుకుంటామని అన్నారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాలు తాము ఆశించిన మేర ఉన్నాయని, కొన్ని జిల్లాల్లో మాత్రం ఆశించిన ఫలితాలు రాలేదని అన్నారు. త్రిముఖ పోరులో బీజేపీకి కొంత నష్టం జరిగిందని రామచందర్ రావు అన్నారు. అనేక చోట్ల హంగ్ వచ్చిందని తెలిపారు. ఇవి కాంగ్రెస్ పార్టీకి సానుకూల ఫలితాలు కావని అభిప్రాయపడ్డారు. బీజేపీని ఓడించడానికి పలు చోట్ల కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్ పార్టీలు కలిసి పనిచేశాయని ఆరోపించారు. అందుకే బీఆర్ఎస్ అన్ని సీట్లు గెలుచుకోగలిగిందని అన్నారు. హంగ్ వచ్చినా బీజేపీ ఎవరికీ మద్దతు ఇవ్వదని స్పష్టం చేశారు. హైదరాబాద్ ప్రజలు ఆ మూడు పార్టీల పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. పట్టణ ప్రాంతాల్లో బీజేపీ బలంగా ఉందని రామచందర్ రావు స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజలు బీజేపీని విశ్వసిస్తున్నారని, తాము కచ్చితంగా అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. తాము ఎవరికీ మద్దతు ఇచ్చేది లేదని, తమకు మద్దతు ఇస్తామంటే తీసుకుంటామని స్పష్టం చేశారు.

# బీఆర్ఎస్ మంచి ఫలితాలు సాధించింది

**కొత్తగూడెంలో వారికి ఓపెన్ ఆఫర్ ఇచ్చాం: కేటీఆర్**
**30 శాతానికి పైగా స్థానాలు గెలుచుకున్నామన్న కేటీఆర్**
**కొత్తగూడెంలో సీపీఐ పార్టీకి మద్దతిస్తామని ఓపెన్ ఆఫర్ ఇచ్చామన్న కేటీఆర్**
**తెలంగాణలో మేమే ప్రత్యామ్నాయమని ప్రజలు స్పష్టం చేశారన్న కేటీఆర్**

హైదరాబాద్, జై భీమ్ న్యూస్

రాష్ట్రంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ మంచి ఫలితాలను సాధించిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. గత ఏడాది చివరలో జరిగిన పంచాయతీ, ఇప్పుడు జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో మంచి ఫలితాలు రాబట్టామని అన్నారు. పంచాయతీ ఎన్నికల్లో 4 వేలకు పైగా స్థానాలు గెలుచుకున్నామని, ఇప్పుడు 2,500 మున్సిపల్ వార్డుల్లో 750 వరకు గెలుచుకుంటున్నామని అన్నారు. మొత్తంగా 30 శాతానికి పైగా సీట్లు గెలిచామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికార బలాన్ని ఉపయోగించి కొన్ని స్థానాలను దక్కించుకుందని ఆరోపించారు. గద్వాలలో ఒక వార్డులో నాలుగుసార్లు రీకౌంటింగ్ చేయించి కాంగ్రెస్ పార్టీ ఒక్క ఓటుతో గెలిచినట్లు ప్రకటించారని... గద్వాల, చౌటుప్పల్‌లో అధికారాన్ని అడ్డం పెట్టుకుని గెలిచారని ఆరోపించారు. కొన్నిచోట్ల తమ కౌన్సిలర్లను ఎత్తుకెళ్లారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అత్యధిక స్థానాలను కైవసం చేసుకోవడానికి కాంగ్రెస్ అనేక తంటాలు పడుతోందని అన్నారు. 116 మున్సిపాలిటీల్లో తాము సొంతంగా 15 నుంచి 16 గెలుచుకున్నామని కేటీఆర్ వెల్లడించారు. బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు ఈ ఎన్నికల కోసం వీరోచిత పోరాటం చేశారని ప్రశంసించారు. ప్రజలు కూడా ధైర్యంగా బయటకు వచ్చి ఓటేశారని, కానీ కాంగ్రెస్ పార్టీ మోసంతో ఎక్కువ స్థానాలు గెలుచుకుంటోందని అన్నారు. కొత్తగూడెం కార్పొరేషన్‌లో 60 స్థానాలకు గాను సీపీఐ 29 సీట్లు గెలుచుకుందని, తాము 8 నుంచి 10 చోట్ల గెలిచామని కేటీఆర్ అన్నారు. సింగరేణిలో జరుగుతున్న అక్రమాలకు వ్యతిరేకంగా పోరాటం చేసేందుకు కొత్తగూడెంలో తాము బేషరతుగా సీపీఐకి మద్దతిస్తామని ఆయన ప్రకటించారు. ఈ మేరకు ఎమ్మెల్యే సాంబశివరావుతో మాట్లాడినట్లు చెప్పారు. సింగరేణిలో రూ.6 వేల కోట్ల బొగ్గు కుంభకోణం జరిగిందని, దీనిని అడ్డుకునేందుకు మీతో కలిసి వస్తామని సీపీఐకి ఓపెన్ ఆఫర్ ఇచ్చామని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ కలిసి సింగరేణికి అన్యాయం చేస్తున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ దోపిడీ చేస్తుంటే బీజేపీ ఎందుకు మౌనంగా ఉందని ప్రశ్నించారు. తెలంగాణలో బీఆర్ఎస్ మాత్రమే ప్రత్యామ్నాయమని ప్రజలు నిన్న పంచాయతీ, నేడు మున్సిపల్ ఎన్నికల ఫలితాలతో స్పష్టం చేశారని కేటీఆర్ అన్నారు. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ మాత్రమే సమస్యలపై పోరాడుతుందని ప్రజలు తేల్చి చెప్పారని అన్నారు. కలిసొచ్చే లౌకికవాద పార్టీలను కలుపుకుని ముందుకు సాగుతామని ఆయన అన్నారు. ఇదే ఉత్సాహంతో జీహెచ్ఎంసీ, జిల్లా పరిషత్ ఎన్నికల్లో పోటీ చేస్తామని అన్నారు. బీఆర్ఎస్ పార్టీకి మంచి భవిష్యత్తు ఉందనడానికి ఈ ఫలితాలు నిదర్శనమని అన్నారు. ఓడిపోయిన వారు నిరాశపడవద్దని ఆయన సూచించారు. అధికార పార్టీ అంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో 80 నుంచి 90 సీట్లు గెలుచుకోవాలని అన్నారు. బీఆర్ఎస్ 15, హంగ్ 30 మున్సిపాలిటీలు పోను కాంగ్రెస్ ఎన్ని గెలుచుకుందో ఆలోచించాలని అన్నారు.



## వాళ్లు మద్దతిస్తే బీజేపీ ఖాతాలో మరికొన్ని మున్సిపాలిటీలు..

**భైంసాలో మజ్లిస్ గెలుపు**
**ఆదిలాబాద్‌లో 49 వార్డులకు గాను 21 స్థానాలు గెలిచిన బీజేపీ**
**నారాయణపేట, రాయికల్‌లో ముందంజలో బీజేపీ**
**భైంసాలో 26 వార్డులకు 12 చోట్ల మజ్లిస్ విజయం**

హైదరాబాద్, జై భీమ్ న్యూస్

తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు కొనసాగుతోంది. ఆదిలాబాద్ మున్సిపాలిటీలో బీజేపీ అత్యధిక స్థానాలు గెలుచుకుంది. 49 వార్డులకు గాను ఇప్పటివరకు బీజేపీ 21, కాంగ్రెస్ 11, బీఆర్ఎస్ 6 సీట్లు గెలుచుకున్నాయి. నిర్మల్‌లో కాంగ్రెస్‌కు 19, బీజేపీ 10, బీఆర్ఎస్ 1, రాయికల్‌లో బీజేపీ 5, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు మూడు వార్డుల చొప్పున గెలిచాయి. మెట్‌పల్లిలోనూ బీజేపీ ముందంజలో ఉంది. కామారెడ్డిలో కాంగ్రెస్ 19, బీజేపీ 18, బీఆర్ఎస్ 10 వార్డులు దక్కించుకున్నాయి. నారాయణపేటలో 24 వార్డులకు గాను బీజేపీ అత్యధిక స్థానాలు (11) గెలుచుకుంది. కాంగ్రెస్ 7, బీఆర్ఎస్ 2, ఇతరులు 4 స్థానాల్లో విజయం సాధించాయి. ఈ మున్సిపాలిటీని దక్కించుకోవడం కోసం బీజేపీ స్వతంత్ర అభ్యర్థులతో చర్చలు జరుపుతోంది. ఆదిలాబాద్, నారాయణపేట, మెట్‌పల్లి మున్సిపాలిటీలను బీజేపీ దక్కించుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే స్వతంత్ర అభ్యర్థులు మద్దతిస్తేనే బీజేపీ ఈ మున్సిపాలిటీలను కైవసం చేసుకుంటుంది. నిర్మల్ జిల్లాలోని భైంసా మున్సిపాలిటీని మజ్లిస్ పార్టీ కైవసం చేసుకుంది. 26 వార్డులకు గాను మజ్లిస్ పార్టీ 12 స్థానాల్లో విజయం సాధించింది. కాంగ్రెస్, స్వతంత్ర అభ్యర్థులతో కలిసి మజ్లిస్ పార్టీ ఛైర్మన్ పదవిని దక్కించుకునే అవకాశం ఉంది. నిర్మల్‌లో బీజేపీ ఆరు స్థానాలు దక్కించుకుంది. కార్పొరేషన్ల విషయానికి వస్తే రామగుండం (38), మంచిర్యాల (44), నల్గొండ (27)లో కాంగ్రెస్ ముందంజలో ఉండగా, కరీంనగర్ (13), నిజామాబాద్‌లలో బీజేపీ అగ్రస్థానంలో కొనసాగుతోంది. కొత్తగూడెం కార్పొరేషన్‌ను సీపీఐ (29) కైవసం చేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## వచ్చేది వేసవి కాలం... నిప్పుతో జాగ్రత్త: హైడ్రా కమిషనర్ రంగనాథ్

**వేసవి దృష్ట్యా అగ్ని ప్రమాదాలపై హైడ్రా అవగాహన కార్యక్రమాలు**
**కేవలం 30 సెకన్లలో మంటలు వ్యాపించే ప్రమాదం ఉందని రంగనాథ్ వెల్లడి**
**నిబంధనలు పాటించకపోవడమే ప్రమాదాలకు ప్రధాన కారణం అని స్పష్టీకరణ**




హైదరాబాద్, జై భీమ్ న్యూస్

రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని అగ్ని ప్రమాదాల పట్ల నగర ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సూచించారు. నిప్పుతో ఊహించని ప్రమాదం పొంచి ఉంటుందని, ప్రతిఒక్కరూ అగ్నిమాపక నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఓ అవగాహనా కార్యక్రమంలో ఏవీ రంగనాథ్ మాట్లాడుతూ, "కేవలం 30 సెకన్ల వ్యవధిలోనే మంటలు వేగంగా వ్యాపించే అవకాశం ఉంది. నగరంలో గతంలో జరిగిన అనేక అగ్ని ప్రమాదాలను విశ్లేషిస్తే, నిబంధనలను ఉల్లంఘించడమే ప్రధాన కారణంగా స్పష్టమవుతోంది" అని తెలిపారు. వేసవిలో పొడి వాతావరణం కారణంగా ప్రమాద తీవ్రత మరింత ఎక్కువగా ఉంటుందని ఆయన హెచ్చరించారు. ఈ నేపథ్యంలో హైడ్రా అగ్ని ప్రమాదాల నివారణపై ప్రత్యేకంగా దృష్టి సారించిందని కమిషనర్ వివరించారు. ప్రజల్లో అవగాహన పెంచేందుకు పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. నిబంధనలను తు.చ. తప్పకుండా పాటిస్తేనే ప్రమాదాలను నివారించగలమని, తద్వారా ప్రాణ, ఆస్తి నష్టాన్ని అరికట్టవచ్చని ఏవీ రంగనాథ్ స్పష్టం చేశారు.

## ఆసక్తికరం.. ఛైర్మన్ పదవి ఇచ్చిన పార్టీకే మద్దతు అన్న స్వతంత్ర అభ్యర్థి

హైదరాబాద్, జై భీమ్ న్యూస్

తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా అలియాబాద్ మున్సిపాలిటీలో ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంది. మున్సిపాలిటీలో 20 వార్డులు ఉండగా ఏ పార్టీకి మెజార్టీ రాలేదు. ఇందులో కాంగ్రెస్ పార్టీ 8, బీఆర్ఎస్ 7, బీజేపీ 3, బీఎస్పీ 1 స్థానంలో విజయం సాధించాయి. ఏడో వార్డు నుంచి స్వతంత్ర అభ్యర్థి గాదె వెంకటేశ్ గెలుపొందారు. మున్సిపల్ ఛైర్మన్ పదవి కోసం కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ప్రయత్నాలు చేస్తున్నాయి. ఇందులో భాగంగా స్వతంత్ర అభ్యర్థి గాదె వెంకటేశ్‌తో చర్చిస్తున్నాయి. అయితే మున్సిపల్ ఛైర్మన్ పదవిని తనకు ఎవరు ఇస్తే వారికి మద్దతు ఇస్తానని ఆయన స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. వెంకటేశ్ కౌంటింగ్ కేంద్రం లోనికి వెళుతుండగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల అభ్యర్థులు, నాయకులు ఆయనను అడ్డుకుని మద్దతు కోసం ప్రయత్నించారు. దీంతో కాసేపు అక్కడ ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. పోలీసులు జోక్యం చేసుకుని అతనిని కౌంటింగ్ కేంద్రంలోనికి తీసుకువెళ్లారు. పలుచోట్ల ఏ పార్టీకి మ్యాజిగ్ ఫిగర్ రాలేదు. దీంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నేతలు స్వతంత్ర్య అభ్యర్థులతో చర్చిస్తున్నారు. వారిని క్యాంపులకు తరలించే ప్రయత్నం చేస్తున్నారు. సంగారెడ్డి జిల్లా ఇస్నాపూర్‌లో 26 వార్డులకు గాను బీఆర్ఎస్ 12, కాంగ్రెస్ 10, స్వతంత్రులు 4 చోట్ల విజయం సాధించారు. దీంతో స్వతంత్రులను క్యాంపుకు తరలించేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రయత్నిస్తున్నాయి.

## కవలల పేర్ల వెనుక అర్థాలను వివరిస్తూ చిరంజీవి ట్వీట్

**రామ్‌చరణ్, ఉపాసన కవలలకు ఘనంగా నామకరణం**
**అబ్బాయికి శివ రామ్, అమ్మాయికి అన్వీర దేవిగా పేర్లు**
**మనవళ్ల పేర్లను అధికారికంగా ప్రకటించిన మెగాస్టార్ చిరంజీవి**
**పేర్ల వెనుక ఉన్న లోతైన అర్థాలను వివరించిన తాతయ్య**
**తాత, తండ్రి పేర్ల స్ఫూర్తితో మనవడికి నామకరణం**



హైదరాబాద్, జై భీమ్ న్యూస్

గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్, ఉపాసన కొణిదెల దంపతుల ఇంట ఆనందం వెల్లివిరిసింది. వారి కవల పిల్లలకు నామకరణ మహోత్సవం కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో అత్యంత ఘనంగా జరిగింది. మెగా అభిమానులు, సినీ ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఆ చిన్నారుల పేర్లను తాతయ్య, మెగాస్టార్ చిరంజీవి స్వయంగా సోషల్ మీడియా వేదికగా అధికారికంగా ప్రకటించారు. అబ్బాయికి 'శివ రామ్ కొణిదెల' అని, అమ్మాయికి 'అన్వీర దేవి కొణిదెల' అని నామకరణం చేసినట్లు ఆయన వెల్లడించారు. ఈ మేరకు చిరంజీవి ఓ భావోద్వేగభరితమైన, అర్థవంతమైన నోట్‌ను పంచుకున్నారు. మనవడి పేరు 'శివ రామ్' వెనుక ఉన్న విశిష్టతను, దానికున్న లోతైన అర్థాన్ని చిరంజీవి వివరంగా తెలిపారు. ఈ పేరులో రెండు గొప్ప ఆదర్శాల సంగమం దాగి ఉందని ఆయన పేర్కొన్నారు. తన అసలు పేరు శివ శంకర వరప్రసాద్ నుంచి స్ఫూర్తి పొంది 'శివ' అనే పదాన్ని తీసుకున్నామని, ఇది అంతర్గత శక్తికి, ఆధ్యాత్మిక లోతుకు, నిశ్చలతకు ప్రతీక అని ఆయన వివరించారు. ఇక 'రామ్' అనే పదాన్ని 'రామ్‌చరణ్' పేరు నుంచి స్వీకరించినట్లు తెలిపారు. ఇది ధర్మాన్ని, కరుణను, నైతిక ధైర్యాన్ని ప్రతిబింబిస్తుందని అన్నారు. ఈ రెండు పదాల కలయికతో ఏర్పడిన 'శివ రామ్' అనే పేరు, అంతర్గత శక్తికి, బాధ్యతాయుతమైన ప్రవర్తనకు మధ్య ఉన్న అద్భుతమైన సామరస్యాన్ని తెలియజేస్తుందని చిరంజీవి తన నోట్‌లో పేర్కొన్నారు. ఇక మనవరాలి పేరు 'అన్వీర దేవి' గురించి వివరిస్తూ, ఇది దైవికమైన స్త్రీ శక్తికి అరుదైన, అత్యంత శక్తివంతమైన ప్రతిరూపమని చిరంజీవి తెలిపారు. విజయవాడ కనకదుర్గమ్మ ఆశీస్సులతో ఈ పేరును ఎంచుకున్నామని, 'అన్వీర' అంటే నిర్భయం, ఎలాంటి కష్టాన్నైనా తట్టుకుని నిలబడే స్థితిస్థాపకత, దైవిక రక్షణ అని అర్థం వస్తుందని ఆయన వివరించారు. ఈ పేరులో దయ, అచంచలమైన ధైర్యం, మొక్కవోని బలం ప్రతిబింబిస్తాయని అన్నారు. "శివ రామ్, అన్వీర దేవి తమ అందమైన జీవిత ప్రయాణాన్ని ప్రారంభిస్తున్న ఈ శుభ తరుణంలో మీ అందరి ఆశీస్సులు వారికి కావాలి" అని చిరంజీవి తన ప్రకటనను ముగించారు. అపారమైన ఆనందంతో, దైవానుగ్రహంతో ఈ పేర్లను ప్రకటిస్తున్నట్లు ఆయన తెలిపారు.

## ఒక్క ఓటుతో వరించిన విజయం

హైదరాబాద్, జై భీమ్ న్యూస్

మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో ఆసక్తికర ఫలితాలు వెలువడుతున్నాయి. ఒక్క ఓటు అభ్యర్థుల తలరాతను మార్చేసింది. రెండు చోట్ల ఒక్క ఓటుతో కాంగ్రెస్ అభ్యర్థులను విజయం వరించింది. కల్వకుర్తి మున్సిపాలిటీలోని పదో వార్డులో కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థుల మధ్య విజయం దోబూచులాడింది. తొలుత కాంగ్రెస్ అభ్యర్థి ఎజాస్ కు రెండు ఓట్ల మెజారిటీ రాగా బీఆర్ఎస్ అభ్యర్థి తాహిర్ రీకౌంటింగ్ కు దరఖాస్తు చేసుకున్నారు. దీంతో అధికారులు మరోసారి ఓట్లు లెక్కించగా.. ఎజాస్ కు 259 ఓట్లు, తాహిర్ కు 258 ఓట్లు వచ్చాయి. దీంతో కాంగ్రెస్ అభ్యర్థి ఎజాస్ గెలుపొందినట్లు అధికారులు ప్రకటించారు. పరకాల మున్సిపాలిటీలోని 17వ వార్డు ఫలితాల్లో కాంగ్రెస్ అభ్యర్థి బొచ్చు సుభద్రకు 369 ఓట్లు పోలవగా.. బీఆర్ఎస్ అభ్యర్థి శనిగరపు రజినికి 368 ఓట్లు వచ్చాయి. దీంతో రజిని రీకౌంటింగ్ కు దరఖాస్తు చేసుకోగా రెండోసారి కౌంటింగ్ చేసినా ఫలితంలో మార్పులేదు. దీంతో కాంగ్రెస్ అభ్యర్థి బొచ్చు సుభద్ర గెలుపొందినట్లు అధికారులు ప్రకటించారు.

## మున్సిపల్ ఎన్నికల్లో మంత్రి వివేక్ కు భంగపాటు

**వివేక్ నియోజకవర్గంలోని క్యాతనపల్లి మున్సిపాలిటీ బీఆర్ఎస్ కైవసం**
**సీపీఐతో పొత్తు పెట్టుకుని జయకేతనం ఎగురవేసిన బీఆర్ఎస్**
**ఓటమిని జీర్ణించుకోలేకపోతున్న కాంగ్రెస్ శ్రేణులు**



హైదరాబాద్, జై భీమ్ న్యూస్

తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ కొనసాగుతోంది. అభ్యర్థుల భవితవ్యం మరికొన్ని గంటల్లో తేలనుంది. 136 కౌంటింగ్ కేంద్రాల్లో పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు దాదాపు పూర్తయింది. ప్రస్తుతం వెలుడిన ఫలితాలు, కొనసాగుతున్న ట్రెండ్స్ ప్రకారం కాంగ్రెస్ పార్టీ భారీ ఆధిక్యతను కనబరుస్తోంది. మరోవైపు, మంచిర్యాల జిల్లా రాజకీయాల్లో ఊహించని పరిణామం చోటుచేసుకుంది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి సొంత నియోజకవర్గం చెన్నూర్ పరిధిలోని క్యాతనపల్లి మున్సిపాలిటీని బీఆర్ఎస్ పార్టీ కైవసం చేసుకుంది. హోరాహోరీగా సాగిన ఈ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. బీఆర్ఎస్, సీపీఐ పార్టీలు ముందస్తు పొత్తుతో ఎన్నికలకు వెళ్లడం ఇక్కడ ప్రధానంగా కలిసివచ్చింది. ఈ రెండు పార్టీల బలం కలిపి 14 సీట్లకు చేరడంతో మున్సిపల్ పీఠం దక్కించుకోవడం సులువైంది. మొత్తం 22 వార్డులు ఉన్న క్యాతనపల్లి మున్సిపాలిటీలో బీఆర్ఎస్ 10 వార్డులు, కాంగ్రెస్ 7 వార్డులు, సీపీఐ 4 వార్డులు, ఇండిపెండెంట్ ఒక వార్డులో విజయం సాధించారు. కేడర్‌ను సమన్వయం చేయడంలో మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ విజయవంతమయ్యారు. నియోజకవర్గంలో పట్టు కోల్పోకుండా ఆయన వ్యూహాత్మకంగా అడుగులు వేయడంతో అక్కడ బీఆర్ఎస్ జెండా ఎగిరింది. మంత్రి వివేక్ ఇలాకా కావడంతో కాంగ్రెస్ పార్టీ ఈ మున్సిపాలిటీని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. అయితే, క్షేత్రస్థాయిలో సీపీఐతో పొత్తు కుదరకపోవడం, స్వతంత్ర అభ్యర్థుల ప్రభావం కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు అవకాశాలను దెబ్బతీశాయి. ఈ ఓటమిని కాంగ్రెస్ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నాయి.

## మున్సిపల్ ఎన్నికల ఫలితాలు

**రామాయంపేటలో భార్యాభర్తల విజయం**
**కాంగ్రెస్ పార్టీ నుంచి చెరో వార్డులో విజయం సాధించిన భార్యాభర్తలు**
**బెజవాడ నాగరాజు, భార్య లావణ్య విజయం**
**తెలంగాణలో అత్యధిక స్థానాలను కైవసం చేసుకున్న కాంగ్రెస్**

హైదరాబాద్, జై భీమ్ న్యూస్

తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు కొనసాగుతోంది. ఇప్పటి వరకు అత్యధిక మున్సిపాలిటీలను కాంగ్రెస్ కైవసం చేసుకుంది. సంగారెడ్డి జిల్లాలోని రామాయంపేట మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. ఇక్కడ భార్యాభర్తలైన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు రెండు వార్డుల నుంచి విజయం సాధించడం గమనార్హం. ఓ వార్డు నుంచి బెజవాడ నాగరాజు 126 ఓట్ల మెజార్టీతో సమీప అభ్యర్థిపై విజయం సాధించగా, మరో వార్డు నుంచి నాగరాజు భార్య లావణ్య 281 ఓట్ల మెజార్టీతో గెలిచారు. మధ్యాహ్నం రెండున్నర గంటల వరకు ఫలితాలను చూస్తే కాంగ్రెస్ 48 మున్సిపాలిటీలను, బీఆర్ఎస్ 10, ఇతరులు 14 మున్సిపాలిటీలలో విజయం సాధించారు. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీలలో వార్డుల పరంగా చూస్తే కాంగ్రెస్ 1,187, బీఆర్ఎస్ 638, బీజేపీ 214, ఇతరులు 212 వార్డుల్లో విజయం సాధించారు.

## గర్భిణులు కాఫీ తాగొచ్చా?

గర్భధారణ సమయంలో జీవనశైలి, ఆహారపు అలవాట్లపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. కాబోయే తల్లులలో తరచుగా తలెత్తే ప్రశ్న ఏమిటంటే కాఫీ తాగడం మంచిదేనా అని. ముఖ్యంగా కెఫీన్ కంటెంట్ కారణంగా వారి శిశువు మెదడు అభివృద్ధికి సురక్షితమేనా అనే ప్రశ్నలు కూడా తలెత్తుతుంటాయి. కెఫీన్ ఎక్కువగా తీసుకోవడం వల్ల



పిండంపై ఎలాంటి ప్రభావం ఉంటుంది? కాఫీ అనేది కెఫిన్ ప్రసిద్ధ మూలం. ఇది కేంద్ర నాడీ వ్యవస్థను ప్రభావితం చేస్తుంది. మితమైన మొత్తంలో కెఫిన్ చాలా మందికి సురక్షితంగా పరిగణిస్తుంటారు. గర్భధారణ సమయంలో తల్లి ఏది తిన్నా అది కడుపులో పెరుగుతున్న బిడ్డపై ప్రత్యక్ష ప్రభావం చూపుతుందని చెబుతున్నారు వైద్యులు. గర్భిణీ స్త్రీలు కెఫిన్ చాలా నెమ్మదిగా జీర్ణం కావడమే దీనికి కారణం. రక్తప్రవాహంలో ఎక్కువసేపు ఉంటుంది. కెఫీన్‌ను సమర్థవంతంగా విచ్ఛిన్నం చేయడానికి అవసరమైన ఎంజైమ్‌లు పిండంలో లేనందున బిడ్డపై ప్రభావం చూపుతుందంటున్నారు. కెఫీన్ వినియోగం పిండం మెదడు అభివృద్ధిని ఎలా ప్రభావితం చేస్తుంది? గర్భధారణ సమయంలో అధిక కెఫిన్ శిశువు మెదడు అభివృద్ధికి ఆటంకం కలిగిస్తుంది. ఇది భవిష్యత్ పలు సమస్యలకు దారి తీసేలా ఉంటుంది. న్యూరోఫార్మకాలజీలో ప్రచురించిన పరిశోధన ప్రకారం.. చాలా కెఫిన్ మెదడు సర్క్యూట్లకు అంతరాయం కలిగిస్తుందని సూచిస్తుంది. కొన్ని అధ్యయనాలు గర్భంలో అధిక స్థాయిలో కెఫిన్‌కు గురయ్యే శిశువులకు అటెన్షన్ డిజార్డర్స్, హైపర్యాక్టివిటీ వంటి సమస్యలు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని సూచిస్తున్నాయి. అయినప్పటికీ, ఈ ప్రమాదాలు ప్రధానంగా అధిక కెఫిన్ వినియోగంతో ముడిపడి ఉన్నాయని డాక్టర్ విష్ణోయ్ చెబుతున్నారు.

## ఉప్పు తినడం పూర్తిగా మానేశారా?


ఒక హెల్తీ అడల్ట్ రోజుకు 4 గ్రాముల కంటే ఎక్కువ ఉప్పు తినకూడదని ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక తెలిపింది. అలాగని ఉప్పు పూర్తిగా మానేయకూడదు అంటున్నారు నిపుణులు. అయితే 30 రోజులు సాల్ట్ తినడం మానేస్తే ఏమవుతుందో ఇప్పుడు మనం



తెలుసుకునే ప్రయత్నం చేద్దాం. బరువు తగ్గుతారు : ఉప్పు తినడం ఆపేస్తే బరువు తగ్గుతారు అంటున్నారు నిపుణులు. ఒక నెల పాటు సాల్ట్ తినకపోతే శరీరం తక్కువ సోడియంకు అడ్జస్ట్ అవడం మొదలు అవుతుంది దీంతో సోడియం లెవెల్స్ డ్రాప్ అవుతాయి. ఆ పరిస్థితులకు శరీరం సర్దుకుంటుంది కూడా. సాధారణంగా సోడియం నీటి శాతాన్ని హోల్డ్ చేయడానికి సహాయపడుతుంది. శరీరంలో అది ఎక్కువ లేకపోతే నీటి శాతం తగ్గుతుంది కాబట్టి వెయిట్ లాస్ అవుతారు. సాల్టీ ఫుడ్స్‌లో చాలా కేలరీలు ఉంటాయి. వీటికి దూరంగా ఉంటే కేలరీల ఇన్‌టెక్ తగ్గి బరువు తగ్గుతారు. ఎందుకంటే సాల్టీ ఫుడ్స్ మానేస్తే హెల్తీ ఫుడ్స్ తింటాం కాబట్టి శరీరంలోని, ముఖ్యంగా కడుపు, నడుము చుట్టూ ఉన్న కొవ్వు తగ్గడానికి స్కోప్ ఉంటుంది. బ్లోటింగ్ వంటి సమస్యలకు గుడ్ బాయ్ చెప్పవచ్చు. అయితే, చాలా త్వరగా బరువు తగ్గితే ఆరోగ్యానికి హానికరం అని మాత్రం గుర్తు పెట్టుకోండి.జీర్ణ సమస్యలు : ఉప్పు డైజెషన్‌కు కూడా అవసరమే. ఉప్పులోని సోడియం స్టమక్ యాసిడ్ తయారు కావడానికి అవసరం. సడన్‌గా సాల్టిఫుట్స్ మానేస్తే డైజెస్టివ్ సిస్టమ్ అడ్జస్ట్ అవదు. సాల్ట్‌కు బదులు ఫైబర్-రిచ్ ఫ్రూట్స్ వంటివి తింటే వాటిని అరిగించుకోవడానికి డైజెస్టివ్ సిస్టమ్‌కు కష్టమైపోతుంది. దీంతో కడుపు నొప్పి, ఇతర అజీర్తి సమస్యలు వస్తాయి అంటున్నారు నిపుణులు. మానసిక ఆరోగ్యం: ఉప్పును పూర్తిగా మానేస్తే బ్రెయిన్ మీద ప్రభావం పడే అవకాశం ఉంటుంది. ఇది ఒత్తిడి, ఆందోళన వంటి మానసిక సమస్యలకు దారితీస్తుంది. సోడియం శరీరంలోని ఫ్లూయిడ్స్ మెయింటెన్ చేయడానికి అవసరం. ఇది నాడీ వ్యవస్థ పనితీరుకు కూడా ముఖ్యం. సోడియం తక్కువైతే నాడీ కణాల మధ్య కమ్యూనికేషన్ సరిగ్గా జరగక మూడ్ పాడవుతుంది.

## ఈ కాయతో బోలెడన్నీ ప్రయోజనాలు

చేదు ఆరోగ్యానికి మంచి అని తెలిసిన కూడా చాలా మంది తినడానికి ఇష్టపెట్టుకోరు. చేదుగా ఉండే పదార్థాల జోలికి అసలు దగ్గరగా ఉండరు.చేదుగా ఉండే పదార్థాలకు కిలోమీటరు దూరంలో ఉంటారు. అయితే కూరగాయాల్లో కాకరకాయ



చేదుగా ఉంటుంది. అసలు దీనిని తినడానికి ఎవరూ ఇష్టపడరు. కాకరకాయను ఎలా వండిన కూడా చేదుగా ఉంటుంది. కనీసం ఏడాదికి కూడా ఒక్కసారి కూడా వీటిని తినరు. ఇందులోని పోషకాలు శరీర ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది. ఈ కాకరకాయను వారానికి ఒకసారి అయిన తినడం వల్ల అనారోగ్య సమస్యలు బారిన పడకుండా ఆరోగ్యంగా ఉంటారని వైద్య నిపుణులు చెబుతున్నారు. దీనిని డైలీ తినడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో బాగా ఉపయోగపడుతుంది. ఇవే కాకుండా వ్యాధికారక ప్రమాదాల నుంచి కాపాడటంలో కాకరకాయలు ముఖ్య పాత్ర పోషిస్తాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. దీనివల్ల ఇవే కాకుండా ఇంకా బోలెడన్నీ ప్రయోజనాలు ఉన్నాయి. మరి ఈ ప్రయోజనాలేంటో తెలియాలంటే ఆలస్యం చేయకుండా ఈ ఆర్టికల్‌పై ఓ లుక్కేయండి. కాకరకాయలో ఎక్కువగా పాలీపెప్టైడ్-పి అనే ఇన్సులిన్ వంటి సమ్మేళనాలు ఉన్నాయి. ఇవి రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో బాగా సహాయపడతాయి. కాకరకాయ మధుమేహం ఉన్నవారి ఆరోగ్యానికి చాలా మంచిది. ఇందులో ఫైబర్ కంటెంట్ ఎక్కువగా ఉంటుంది. ఇది మలబద్ధకం వంటి సమస్యల నుంచి కాపాడుతుంది. చేదు అనారోగ్య వ్యాధుల నుంచి కాపాడుతుంది. ఇందులోని పోషకాలు చర్మ ఆరోగ్యాన్ని మేలు చేస్తాయి. అలాగే ఈ కాకరకాయ మొక్క ఆకులను పేస్ట్ చేసి తలకు అప్లై చేస్తే చుండ్రు తగ్గుతుంది. చేదు వల్ల తలలో పేలు వంటివి ఉన్న కూడా మాయమైపోతాయి. మీకు నచ్చిన విధంగా కాకరకాయను వండి తినడం వల్ల తలనొప్పి నుంచి విముక్తి పొందుతారు. దీనిని తినలేమని అనుకునేవారు జ్యూస్ చేసి కూడా తాగవచ్చు. దీని జ్యూస్ తాగితే కిడ్నీ సమస్యలు, మోకాలి నొప్పులు తొందరగా తగ్గుతాయి. ఎలాంటి ఆపరేషన్, మందులు వాడకుండా కిడ్నీలోని రాళ్ల సమస్యలను తగ్గించవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. కొందరు మైగ్రేన్ సమస్యతో బాధపడుతుంటారు. ఎన్ని మందులు వాడిన ఈ సమస్య తగ్గదు. అలాంటి వారు కాకరకాయ ఆకలను మెత్తగా చేసి దానిని నుదిటిపై రాస్తే.. క్షణాల్లో తలనొప్పి నుంచి విముక్తి పొందుతారు.

# మునగ స్త్రీలకు ఎంతో మేలు చేస్తుంది

మన దేశంలో మునగ ప్రయోజనాలను పొందడంలో ఎలాంటి ఇబ్బందులు ఉండవు..? ఇది అందరికీ తెలిసిన విషయమే.. సులువుగా లభించే మునగకాయలను అందరూ ఇష్టపడతారు.గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంట్లో మునగ చెట్టు ఉంటుంది. ఒక్కొక్కరు ఒక్కో రకంగా వాటి నుంచి లభించే మునగకాయలను తింటారు. మునగ రుచి, ఆరోగ్య ప్రయోజనాలు ప్రజలను ఆకర్షిస్తాయి. అయితే.. మునగలో ఉండే విటమిన్ సి, యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు దగ్గు, జలుబును నివారిస్తాయి. అంతేకాదు, క్యాల్షియం , ఐరన్ మునగలో పుష్కలంగా ఉంటాయి. మగవారికి మునగతో చేసిన వంటకాలు తినాలని చెబుతుంటారు. అయితే.. ఇది మగవారికే కాకుండా.. మహిళలకు కూడా ఎంతో ప్రయోజనాలను కల్గిస్తుంది. మునగలో గర్భిణీ స్త్రీలకు అవసరమైన నియాసిన్, రిబోఫ్లావిన్ , విటమిన్ బి12 వంటి బి విటమిన్లు కూడా ఉన్నాయి. మునగాలోని యాంటీబయాటిక్ ఏజెంట్లు రక్త ప్రసరణను మెరుగుపరచడంలో సహాయపడతాయి. అలాగే, మునగలో జింక్ ఉంటుంది, ఇది చర్మ సంరక్షణకు చాలా మంచిది. గ్లుటాతియోన్ చర్యను వేగవంతం చేసే లక్షణాలను కూడా మునగ కలిగి ఉంది. శరీరంలో మొటిమలు ఏర్పడటాన్ని తగ్గిస్తుంది. మునగ ఆకు రసం చర్మాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. పాలిచ్చే తల్లులు పాల సరఫరాను పెంచడానికి మునగను ఉపయోగిస్తారు. అంతే కాకుండా మురిపంలో ఉండే పొటాషియం, ఐరన్, కాల్షియం, విటమిన్ సి, బి, బీటా కెరోటిన్ , అమినో యాసిడ్స్ తల్లి పాలను పెంచడంలో సహాయపడతాయి. మునగ కొవ్వు తగ్గడానికి , బరువు తగ్గడానికి సహాయపడుతుంది. మునగలో ఫైబర్ , మోనోశాచురేటెడ్ ఫ్యాటీ యాసిడ్స్ పుష్కలంగా ఉన్నాయి. ఇవి ఆకలిని అదుపులో ఉంచుతాయి. ఉసిరి ఆకులతో నీరు తాగడం వల్ల కూడా రుతు నొప్పి తగ్గుతుంది. ఉసిరికాయ ఆకులతో నీటిని మరిగించి రోజూ తాగడం వల్ల కొలెస్ట్రాల్ అదుపులో ఉంటుంది. ఇది కాకుండా, మునగా యొక్క హెపాటోప్రొటెక్టివ్



ఫంక్షన్ కాలేయాన్ని రక్షించడానికి , టాక్సిన్స్ నుండి రక్షించడానికి సహాయపడుతుంది. శరీరంలోని క్యాలరీల పరిమాణాన్ని తగ్గించడంలో కూడా మునగ మంచిది. మునగ లైంగిక ఉద్దీపనలో కూడా సహాయపడుతుంది. మునగలో ఉండే కామోద్దీపన సమ్మేళనం టెస్టోస్టెరాన్ స్థాయిలను పెంచుతుంది. ఆహారంలో మునగ పువ్వును చేర్చుకోవడం కూడా స్పెర్మ్ కౌంట్ పెంచడంలో సహాయపడుతుంది.

## పచ్చి ఉల్లిపాయల ప్రయోజనాలు

మన వంటింట్లో దొరికే కూరగాయలలో ఉల్లిపాయ కూడా ఒకటి. ఈ ఉల్లిపాయ వల్ల ఎన్నో రకాల లాభాలు ఉన్నాయి అన్న విషయం మనందరికీ తెలిసిందే. ఉల్లిపాయను తరచుగా తినడం వల్ల అనేక రకాల ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. ఉల్లి చేసే మేలు అంతా ఇంతా కాదు. అందుకే ఉల్లి చేసే మేలు తల్లి కూడా చేయదని అంటూ ఉంటారు. అయితే కొందరు పచ్చి ఉల్లిపాయలు తింటే మరి కొందరు కూరల్లో తినడానికి



ఇష్టపడుతూ ఉంటారు. మనలో చాలామంది పచ్చి ఉల్లిపాయ తినడానికి అసలు ఇష్టపడరు. కానీ చాలా మందికి తెలియని విషయం ఏమిటంటే ఉల్లిపాయ వల్ల ఎన్నో రకాల ప్రయోజనాలు కలుగుతాయట. మరి పచ్చి ఉల్లిపాయ తింటే ఎలాంటి ప్రయోజనాలు కలుగుతాయో ఇప్పుడు మనం తెలుసుకుందాం.. పచ్చి ఉల్లిపాయల్లో మన శరీరానికి అవసరమైన విటమిన్ సి, విటమిన్ బీ6, కాల్షియం, ఫాస్పరస్, పొటాషియం వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. అలాగే పచ్చి ఉల్లిపాయల్లో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి మన శరీరంలో ఉండే ఫ్రీ రాడికల్స్ తో పోరాడటానికి సహాయపడతాయి. అలాగే ఎన్నో రోగాల ప్రమాదాన్ని కూడా తగ్గిస్తాయని చెబుతున్నారు. పచ్చి ఉల్లిపాయలలో యాంటి క్యాన్సర్ లక్షణాలు కూడా ఉంటాయి. అంటే వీటిని మోతాదులో తింటే క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల ప్రమాదం తగ్గుతుందని కొందరు ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అలాగే పచ్చి ఉల్లిపాయ డయాబెటిక్ పేషెంట్లకు కూడా ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందట. ఎలా అంటే మధుమేహులు పచ్చి ఉల్లిపాయలను తింటే రక్తంలో చక్కెర స్థాయిలు నియంత్రణలో ఉంటాయని చెబుతున్నారు. పచ్చి ఉల్లిపాయలను తింటే శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిలు నార్మల్ గా ఉంటాయట. దీంతో మీ గుండె ఆరోగ్యంగా ఉంటుందని, శరీరంలో కొలెస్ట్రాల్ లెవెల్స్ నార్మల్ గా ఉంటే గుండెపోటు వచ్చే ప్రమాదం తగ్గుతుందని చెబుతున్నారు. ఉల్లిపాయల్లో యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు ఉంటాయి. అంటే వీటిని తినడం వల్ల మంట, నొప్పి నుంచి ఉపశమనం కలుగుతాయట. ముఖ్యంగా చలికాలంలో కీళ్లనొప్పుల నొప్పుల నుంచి బయటపడాలంటే పచ్చి ఉల్లిపాయలను మోతాదులో తినడం చాలా మంచిదని చెబుతున్నారు. పచ్చి ఉల్లిపాయలు తినడం వల్ల జీర్ణ సంబంధిత సమస్యలు కూడా తలెత్తవట.

## పళ్ళుతోమకుంటే ఏమవుతుంది..?

చాలా మంది తమ నోటిని దేవుని ఇల్లుగా భావిస్తారు. దానిలోని దంతాలు , ఆ ఒక్క నాలుక అన్ని విధాలుగా నీతిగా , శుభ్రంగా ఉంచబడతాయి. అక్కడ స్వేచ్ఛకు అనుమతి లేదు. అయితే కొన్ని ఉన్నాయి. వారి పొడవాటి నాలుకలను వదులుకోండి. దాంతో వారు గందరగోళానికి గురవుతారు. మరికొందరు పళ్లు తోముకోవడం, శు భ్రంగా ఉంచుకోవడం వంటి పనుల జోలికి వెళ్లరు.కానీ ఆ ప్రాతిపదికన, బ్రషింగ్‌ను ఒకటి లేదా రెండు రోజులు దాటవేయడం పెద్ద విషయంగా అనిపించదు. అయినప్పటికీ, మీ దంత పరిశుభ్రతను చాలా కాలం పాటు నిర్లక్ష్యం చేయడం వలన మీ శరీరం యొక్క మొత్తం ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. నోరు మిలియన్ల బ్యాక్టీరియాలకు నిలయం. , మీరు మీ దంతాలను క్రమం తప్పకుండా బ్రష్ చేయకపోతే, బ్యాక్టీరియా సంఖ్య పెరుగుతుంది. ఇది నోటి దుర్వాసన లేదా తడిసిన దంతాల కంటే అనేక సమస్యలకు దారితీస్తుంది. బ్రష్ చేయని మొదటి కొన్ని రోజుల్లో నోటిలో తక్షణ మార్పులు సంభవిస్తాయి మీరు బ్రష్ చేయడం ఆపివేసినప్పుడు గుర్తించదగిన మొదటి మార్పు దంతాల మీద మృదువైన ఫలకం ఏర్పడటం. ఈ ఫలకం బ్యాక్టీరియాతో నిండిపోయి చిగుళ్లను చికాకుపెడుతుంది. ఇది మంటను కలిగిస్తుంది , ఈ ఎర్రబడిన చిగుళ్ళను తాకినప్పుడు లేదా సున్నితంగా బ్రష్ చేసినప్పుడు సులభంగా రక్తస్రావం అవుతుంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం, డెంటల్ ప్లేక్ డెంటిన్‌లో డీకాల్సిఫికేషన్‌ను ప్రారంభించే సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. కాబట్టి ఈ వైవిధ్యం ఫలకం మీ దంతాలను నాశనం చేసే ముందు ఎనామెల్ కింద రక్షిత పొరపై 48 గంటలలోపు సంభవిస్తుంది.



## జీరో ఆయిల్ కుకింగ్

ఎప్పుడైనా నూనె రుచి చూశారా? కచ్చితంగా నచ్చదు. కానీ నూనె వల్లే వంట రుచికరంగా ఉంటుందని నమ్ముతాం. అయితే ఆయిల్, నెయ్యి, వెన్నెకు సంబంధించిన ఒక్క చుక్క లేకుండా కూడా టేస్టీ ఫుడ్ ప్రిపేర్ చేయొచ్చని చెప్తున్నారు నిపుణులు.రుచిని త్యాగం చేయకుండా రుచికరమైన భోజనం వండొచ్చని వాగ్దానం చేస్తున్నారు. ప్రస్తుతం జీరో ఆయిల్ కుకింగ్ ట్రెండ్ అవుతుండగా.. ఈ విప్లవాత్మక విధానం, ఉపయోగాల గురించి తెలుసుకుందాం. జీరో ఆయిల్ కుకింగ్ అనేది ఎటువంటి నూనెలు లేదా కొవ్వులను ఉపయోగించకుండా ఆహారాన్ని తయారు చేయడాన్ని సూచిస్తుంది. ఈ వంట పద్ధతి స్టీమింగ్, బాయిల్ చేయడం, గ్రిల్లింగ్, రోస్ట్ చేయడం లేదా ఆహారాన్ని అంటుకోకుండా నిరోధించడానికి నాన్-స్టిక్ కుక్‌వేర్‌లను ఉపయోగించడం వంటి ప్రత్యామ్నాయాలపై ఆధారపడి ఉంటుంది. సుగంధ ద్రవ్యాలు, మూలికలు, నిమ్మకాయ, ఇతర సహజ రుచులను టేస్ట్ మెరుగుపరచడానికి ఉపయోగిస్తారు. తద్వారా నూనె అవసరం లేకుండా ఆహారాన్ని పోషకమైనదిగా, రుచిగా మారుస్తుంది. గుండె ఆరోగ్యం : నూనెను తగ్గించడం, ముఖ్యంగా అనారోగ్యకరమైన కొవ్వులు, చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తుంది. గుండె జబ్బులు, రక్తపోటు, స్ట్రోక్స్ ప్రమాదాన్ని నివారిస్తుంది. నూనెలో సంతృప్త కొవ్వులు ఉంటాయి. ఇవి గుండెకు చాలా అనారోగ్యకరమైనవి. కాబట్టి నూనెను వాడకుండా ఉండటం ద్వారా.. ఈ సంతృప్త కొవ్వులను కూడా వదిలించుకోవచ్చు. వెయిట్ మేనేజ్మెంట్ : నూనెలో కేలరీలు ఎక్కువగా ఉన్నందునా.. మీ ఆహారం నుంచి దానిని తొలగించడం మొత్తం కేలరీల తీసుకోవడం తగ్గించడంలో సహాయపడుతుంది. ఇది కిలోల బరువు తగ్గడానికి, వెయిట్ మేనేజ్మెంట్ కు సహాయపడుతుంది. నూనెలో కొవ్వు ఉంటుంది. అధిక కొవ్వు అధిక బరువు పెరగడానికి దారితీస్తుంది. కాబట్టి జీరో ఆయిల్ కుకింగ్ బరువు నిర్వహణలో సహాయపడుతుంది. జీర్ణక్రియ మెరుగు :భారీ, జిడ్డుగల ఆహారాలను జీర్ణం చేయడం కష్టం. అజీర్ణం, ఉబ్బరం, ఇతర జీర్ణ సమస్యలకు దారితీయవచ్చు. నూనె లేకుండా వంట చేయడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. పేగు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. నూనె లేకుండా, నూనె రహిత వంటకాలు చేసేందుకు కూరగాయలు, ధాన్యాలపై ఎక్కువ దృష్టి పెట్టడం వలన ఎక్కువ ఫైబర్ తీసుకునేందుకు కారణమవుతుంది. దీనివల్ల జీర్ణక్రియ సులభమవుతుంది.



జై భీమ్
తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా
Jai Bheem TV
STRUGGLE FOR JUSTICE
సామాన్యుడి ఆయుధంగా





# సీతతో విడిపోయిన తర్వాత చాలా సంతోషంగా ఉన్నా: పార్తీబన్

**1990లో ప్రేమ వివాహం చేసుకున్న సీత, పార్తీబన్**

**12 ఏళ్ల తర్వాత విడిపోయిన జంట**

**సీతలో విడిపోయినందుకు బాధ లేదన్న పార్తీబన్**

సినీ నటి సీత, దర్శకుడు, నటుడు పార్తీబన్ 1990లో ప్రేమ వివాహం చేసుకున్న సంగతి తెలిసిందే. దాదాపు 12 ఏళ్ల వైవాహిక జీవితం తర్వాత ఇద్దరూ విడిపోయారు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వీరు ఒక కుమారుడిని దత్తత తీసుకున్నారు. విడిపోయినప్పటి నుంచి పార్తీబన్ ఒంటరిగానే ఉంటున్నారు. సీత మాత్రం మరొక వ్యక్తిని పెళ్లాడి, ఆ తర్వాత ఆయనతో కూడా విడిపోయారు. సీతతో తన వివాహం, విడిపోవడంపై పార్తీబన్ మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఓ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ... సీతతో విడిపోయినందుకు తాను ఎప్పుడూ బాధపడలేదని చెప్పారు. నిజం చెప్పాలంటే ఆమెతో విడాకులు తీసుకున్న తర్వాత చాలా సంతోషంగా ఉన్నానని తెలిపారు. అయితే, ఆమెతో ఉన్న 12 సంవత్సరాలు తన జీవితంలో మధురమైన జ్ఞాపకంగా మిగిలిపోయిందని చెప్పారు. ఈ రోజుల్లో పురుషులు కానీ, మహిళలు కానీ వివాహం చేసుకోవడం కంటే స్వతంత్రంగా ఉండానికే ఇష్టపడతారని... ఏ మహిళ కూడా వివాహం పేరుతో పరిమితులు ఉండే జీవితాన్ని కోరుకోదని తెలిపారు. పార్తీబన్ చేసిన ఈ కామెంట్స్ వైరల్ అవుతున్నాయి.

# 'కపుల్ ఫ్రెండ్లీ'... వాలంటైన్స్ డే రోజున సరికొత్త ప్రేమ కథా చిత్రం

**సంతోష్ శోభన్, మానస వారణాసి జంటగా 'కపుల్ ఫ్రెండ్లీ'**

**వాలెంటైన్స్ డే కానుకగా ఫిబ్రవరి 14న విడుదల**


**సినిమా సక్సెస్‌పై ధీమా వ్యక్తం చేసిన చిత్ర బృందం**

**ఫ్యామిలీతో చూసే ప్యూర్ లవ్ స్టోరీ అని వెల్లడి**

**ఫిబ్రవరి 13 సాయంత్రం నుంచే షోలు ప్రారంభం**




యంగ్ హీరో సంతోష్ శోభన్, మాజీ మిస్ ఇండియా మానస వారణాసి జంటగా నటించిన కొత్త సినిమా 'కపుల్ ఫ్రెండ్లీ'. ప్రేమికుల రోజు కానుకగా ఈ చిత్రం ఫిబ్రవరి 14న తెలుగు, తమిళ భాషల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఫీల్ గుడ్ లవ్ స్టోరీగా తెరకెక్కిన ఈ సినిమా ప్రీ-రిలీజ్ ప్రెస్ మీట్‌లో చిత్ర బృందం విజయంపై ధీమా వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా హీరో సంతోష్ శోభన్ మాట్లాడుతూ, "నాకు సక్సెస్ రావాలని అందరూ కోరుకుంటుండటం చాలా సంతోషంగా ఉంది. మొదట టైటిల్ చెప్పినప్పుడు నాకూ కొన్ని సందేహాలు వచ్చాయి. కానీ సినిమా చూశాక ఇదే సరైన టైటిల్ అనిపించింది. మంచి పాజిటివ్ వైబ్‌తో వస్తున్న ఈ సినిమా తప్పకుండా విజయం సాధిస్తుందని నమ్ముతున్నా" అని అన్నారు. ట్రైలర్‌కు అద్భుతమైన స్పందన వచ్చిందని, సినిమా సక్సెస్‌పై నమ్మకంగా ఉన్నామని హీరోయిన్ మానస వారణాసి తెలిపారు. డిస్ట్రిబ్యూటర్ ధీరజ్ మొగిలినేని మాట్లాడుతూ, "ఇది స్వచ్ఛమైన ప్రేమకథ. కుటుంబ నేపథ్యంలో సాగే చక్కటి ఎంటర్‌టైనర్. హీరో హీరోయిన్ల మధ్య ఎమోషన్స్ అందరికీ కనెక్ట్ అవుతాయి. ఫిబ్రవరి 13 సాయంత్రం నుంచే థియేటర్లలో షోలు ప్రారంభమవుతాయి" అని వెల్లడించారు. హైదరాబాద్, చెన్నై, విజయవాడ, వైజాగ్‌లలో ప్రీమియర్ షోలు ప్లాన్ చేస్తున్నట్లు తెలిపారు. యూవీ క్రియేషన్స్ సమర్పణలో, యూవీ కాన్సెప్ట్స్ బ్యానర్‌పై అజయ్ కుమార్ రాజు ఈ చిత్రాన్ని నిర్మించారు. అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రానికి 'ఏ' సర్టిఫికెట్ వచ్చినప్పటికీ, ఇది ఫ్యామిలీతో చూసేలా పాజిటివ్‌గా ఉంటుందని చిత్ర యూనిట్ చెబుతోంది. ప్రభాస్ వంటి స్టార్ హీరో నుంచి ప్రశంసలు అందుకున్న ఈ సినిమా, వాలెంటైన్స్ డే వీకెండ్‌లో యువతను, కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని అంచనాలున్నాయి.



# 'కపుల్ ఫ్రెండ్లీ'తో తెరపైకి తెలంగాణ బ్యూటీ!

తెలుగు తెరపై ఈ మధ్య కాలంలో తెలుగు హీరోయిన్స్ జోరు పెరుగుతున్నట్టుగానే కనిపిస్తోంది. కొత్తగా ఇండస్ట్రీకి వస్తున్న దర్శకులు, కొత్త కథానాయికలను పరిచయం చేయడానికి ఎక్కువ ఉత్సాహాన్ని చూపిస్తున్నారు. ఓ మాదిరి బడ్జెట్ సినిమాల ద్వారా పరిచయమవుతున్న ఈ కథానాయికలు, ఆ తరువాత తమ టాలెంట్ తో నిలదొక్కుకుంటున్నారు. ఈ నేపథ్యంలో అటు ఆంధ్ర నుంచి మాత్రమే కాదు, ఇటు తెలంగాణ వైపు నుంచి కూడా పరిచయమవుతున్న హీరోయిన్ల సంఖ్య కూడా పెరుగుతోంది. వరంగల్ నుంచి తెలుగు తెరకి పరిచయమైన ఆనంది, తమిళంలో స్టార్ డమ్ ను సంపాదించుకుంది. ఇప్పటికీ తెలుగులో సినిమాలు చేస్తోంది. ఈషా రెబ్బా కూడా తనదైన స్టైల్లో సినిమాలు .. సిరీస్ లు చేస్తూ వెళుతోంది. ఇక వైష్ణవి చైతన్య 'బేబీ' సినిమాతో సృష్టించిన సంచలనం అంతా ఇంతా కాదు. ఈ నేపథ్యంలో ఇప్పుడు 'మానస వారణాసి' పేరు ఎక్కువగా వినిపిస్తోంది. అందాల పోటీల్లో అనేక బహుమతులు గెలుచుకున్న ఈ బ్యూటీ, ఇప్పుడు 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమాతో అలరించనుంది. మానస వారణాసి ఇంతకు ముందు ఒక సినిమా చేసినప్పటికీ, కొన్ని కారణాల వలన అది ఆడియన్స్ కి రీచ్ కాలేదు. 'కపుల్ ఫ్రెండ్లీ' మాత్రం రిలీజ్ కి ముందే మంచి బజ్ తెచ్చుకుంది. 'వాలెంటైన్స్ డే' సందర్భంగా ఈ నెల 14వ తేదీన ఈ సినిమాను రిలీజ్ చేస్తూ ఉండటంతో, యూత్ అంతా ఈ సినిమాపైనే ఫోకస్ పెట్టింది. ఫ్యామిలీ ఎమోషన్స్ తో పాటు, పొయెటిక్ గా అనిపించేలా రొమాన్స్ ఉంటుందని చెప్పడం యూత్ ను ఎక్కువగా ఆకర్షిస్తోంది. అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వంలో, సంతోష్ శోభన్ జోడీగా మానస వారణాసి తొలి హిట్ కొడుతుందేమో చూడాలి మరి.